ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు 3
బుధవారం 29 జనవరి 2025



కనీస సౌకర్యాలు కల్పించాలి

కాలనీ విస్తరిస్తోంది.. సరైన మౌలిక సదుపాయాలు లేవు. రోడ్లు, డ్రైన్లు, సీసీ రోడ్లు నిర్మించాలి. వీధిలైట్లు ఏర్పాటు చేయాలి. కార్పొరేషన్ అధికారులకు సరైన ప్రణాళిక లేకపోవడంతో మెయింటెనెన్స్ చేయలేకపోతున్నారు. గతంలో నాయకులు పార్టీ కార్యక్రమాల కోసమే ఇటువైపు వచ్చి.. అభివృద్ధి మాత్రం మరిచిపోయారు.

- కె. శ్రీనివాసరావు టీడీపీ ఇన్‌చార్జి



ట్రాన్స్‌ఫార్మర్ తొలగించాలి

ఆలయ ప్రాంగణంలో ట్రాన్స్‌ఫార్మర్ తొలగించాలి. గతంలో ఈ కాలనీ అభివృద్ధికి నోచుకోలేదు. ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యే ఇక్కడి సమస్యలు పట్టించుకుని కనీస మౌలిక సదుపాయాలు కల్పిస్తే కాలనీవాసులు రుణపడి ఉంటారు.

- లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి, వరసిద్ధి వినాయక ఆలయ కమిటీ



పార్కులు అభివృద్ధి కాలేదు

29వ వార్డులో పార్కులు ఉన్నాయి. అయినా అభివృద్ధికి నోచుకోకపోవడం వల్ల పూర్తిగా కంపచెట్లతో నిండి పోయింది. అధికారులు స్పందించి పార్కులను అభివృద్ధి చేస్తే కొంత ఆహ్లాదకరమైన వాతావ రణం ఉంటుంది. వెంటనే చర్యలు తీసుకోవాలి

- పుల్లయ్య, టీడీపీ నాయకుడు, విజయనగర్ కాలనీ



మాట్లాడుతున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత

రోజూ తాగునీరు

- కల్లూరు వార్డులకు రూ.500 కోట్లతో ప్రతిపాదనలు
- గత పాలకుల నిర్లక్ష్యం వల్లే కాలనీలకు ఈ దుస్థితి
- పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి
- ఆంధ్రజ్యోతి చేపట్టిన అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా కార్యక్రమానికి విశేష స్పందన
- భారీగా హాజరైన కాలనీవాసులు
- కార్పొరేషన్ కమిషనర్ దృష్టికి పలు సమస్యలు



చర్చా వేదికలో పాల్గొన్న ప్రజలు

క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారంలో ఇది వినూత్న ప్రయోగం. ప్రజా జీవితంలో పాత్రికేయ రంగాన్ని సృజనాత్మక భాగస్వామిని చేయడానికి ఆంధ్రజ్యోతి ముందుకు వచ్చింది. అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా అనే ప్రతిష్ఠాత్మక కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టింది. దీని ద్వారా స్థానిక ప్రజలు తమ సమస్యలను అధికారులకు, ప్రజా ప్రతినిధులకు వినిపించే సమన్వయపాత్ర పోషించింది. ప్రజలు తమ సమస్యల జాబితాను ప్రకటించే అవకాశం కల్పించడమే కాక కొన్ని సమస్యలు అక్కడికక్కడే పరిష్కారం కావడానికి దోహదం చేసింది. సమస్యలపై వార్తలు, కథనాలు అందించడమేగాక పరిష్కారానికి ప్రజలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసే ఉమ్మడి వేదికగా ఆంధ్రజ్యోతి ఈ కార్యక్రమం చేపట్టింది. తద్వారా తన సామాజిక బాధ్యతను విస్తరించుకున్నది. ఇందులో భాగంగా 29వ వార్డులోని ఉద్యోగ నగర్‌లోని శారద హై స్కూల్‌లో చర్చా వేదికను నిర్వహించింది.



బడ్జెట్ కేటాయించి సమస్యలు పరిష్కరిస్తాం

కార్పొరేషన్ కమిషనర్ రవీంద్రబాబు

ప్రజల నుంచి సమస్యలను నేరుగా తెలుసుకోడానికి ఆంధ్రజ్యోతి ఏర్పాటు ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులను, ప్రజాప్రతినిధులను భాగం చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. 29వ వార్డులో 12 కాలనీలు ఉన్నాయని అన్నారు. కాలనీవాసులు చెప్పిన ప్రతి సమస్యలను ప్రాధాన్యత క్రమంగా పరిష్కరిస్తామని, పిచ్చిమొక్కల తొలగింపు, వీధి దీపాల ఏర్పాటు, వాటర్ సప్లయ్, మైనర్ రిపేర్లు, కల్వర్టు క్లీనింగ్‌లు, వెంట వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. బడ్జెట్‌తో కూడిన సమస్యలపైన ప్రభుత్వ నియమాలతో అంచనాలు రూపొందించి వాటికి పరిపాలన అనుమతులు తీసుకుని ఈ నెలాఖరుకు బడ్జెట్ కేటాయించి దశలవారిగా పనులు ప్రారంభిస్తామన్నారు. కొత్త ఆర్థిక సంవత్సరం నుంచే అన్ని పనులు ప్రారంభమయ్యేలా చేస్తామని హామీ ఇచ్చారు. అమృత్ పథకం కింద రూ.115 కోట్లు మంజూరై టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకు రాలేదని గుర్తు చేశారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ నిధుల వినియోగంపైన ఇప్పటికే సమావేశం నిర్వహించారని, త్వరలోనే అమృత్ పథకాన్ని ప్రారంభించడానికి కృషి చేస్తామన్నారు. కాలనీలో నాన్ అప్రూవల్ లేఅవుట్‌లతో డ్రైనేజీ, రోడ్లు ఏర్పాటు చేయలేకపోతున్నామని ఆయన వివరించారు. కాలనీలో ఎవరైనా సిబ్బంది నిర్లక్ష్యంగా ఉంటే వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు. కుక్కల బెడద నుంచి కాలనీవాసుల నుంచి సమస్యలు వస్తే.. వాటి కోసం ఆపరేషన్ థియేటర్లు ఏర్పాటు చేయించామని, కుక్కలకు సంతాన ఉత్పత్తి జరగకుండా ఆపరేషన్ చేయిస్తున్నామని, ఇందు కోసం ఏఆర్ వ్యాక్సిన్ కూడా అందుబాటులో ఉంచామని తెలిపారు. రోడ్లపై చెత్త వేయకుండా కాలనీ పెద్దలు, నాయకులు ప్రజలను ఆలోచింపచేయాలని, ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించేవారిని ప్రతిరోజు పంపిస్తున్నామని అన్నారు. చెత్త సేకరించేవారు రాకపోతే ఫిర్యాదు చేయాలన్నారు.



హాజరైన మహిళలు



కర్నూలు క్రైం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని 16 వార్డులకు ప్రతి రోజు నీరు అందించేందుకు రూ.500 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం అవుతున్నాయని, గోరుకల్లు రిజర్వాయరు నుంచి నీరందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి తెలిపారు. కాలనీ సమస్యలపై అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా ఆంధ్రజ్యోతి వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మంగళవారం 29వ వార్డులోని ఉద్యోగ నగర్‌లోని శారద హై స్కూల్‌లో చర్చా వేదిక కార్యక్రమం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, కార్పొరేషన్ కమిషనర్ రవీంద్రబాబు, ఎస్ఈ రాజశేఖర్, ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజర్ లక్ష్మణ్, బ్యూరో ఇన్‌చార్జి జి. కొండప్పలతో పాటు కాలనీపెద్దలు, పలు పార్టీల నాయకులు, కాలనీ ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా 29వ వార్డులోని కాలనీవాసులు పలు సమస్యలను ఎమ్మెల్యే, కార్పొరేషన్ కమిషనర్‌ల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యలను సావధానంగా విన్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల ముందు 16 వార్డుల్లో ప్రతిరోజు తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చామని, ఈ అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసకెళ్లామని, అసెంబ్లీలో దీనిపై చర్చ కూడా జరిగిందని అన్నారు. దీనిపై నివేదిక తయారు చేయాలని అధికారులను ఆదేశించినట్లుగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు పరిపాలన అనుమతులు వచ్చిన వెంటనే గోరుకల్లు రిజర్వాయరు నుంచి నీరు అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. 2014 విభజన తర్వాత తాను అపోజిషన్ పార్టీలో ఉన్నా కూడా తాను చంద్రబాబు దృష్టికి పలు సమస్యలు తీసుకెళితే వాటిని వెంటనే పరిష్కరించారని ఆమె గుర్తు చేశారు. గత ఐదేళ్ల పాలన అభివృద్ధిని 30 ఏళ్లు వెనక్కి తీసుకెళితే.. వైసీపీ నాయకుల సంపాదన మాత్రం 30 ఏళ్లు ముందుకు వెళ్లిందన్నారు. భూములు, స్థలాలు ఆక్రమించుకున్నారని ఆమె విమర్శించారు. కాలనీల్లో మందుబాబుల సమస్య, ఆకతాయిల సమస్యపై ప్రతి రోజు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఆమె పోలీసులను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామన్నారు. వీధిలైట్లు వెంటనే సమస్యలను పరిష్కరించాలని కమిషనర్‌ను ఆదేశించారు. వైఎస్సార్ విగ్రహం వద్ద నుంచి శారద స్కూల్ వరకు ఉన్న ఆక్రమణలను తొలగించాలని కమిషనర్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. ఆ తర్వాత రోడ్లు, డ్రైన్లు లాంటి బడ్జెట్‌తో కూడిన సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో తీరుస్తామని, పురపాలక మంత్రి నారాయణ దృష్టికి కూడా ఈ సమస్య తీసుకెళ్లామని చెప్పారు. ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం అభినందనీయమని, దీని వల్ల ఎన్నో ప్రజా సమస్యలు తెలుసుకున్నానని ఎమ్మెల్యే అన్నారు.



వివరాలు 4వ పేజీలో

కాలనీవాసుల హర్షం: ఆంధ్రజ్యోతి వేదిక ద్వారా తమ సమస్యలు ధైర్యంగా చెప్పుకునే అవకాశం కల్పించడంపట్ల కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. తాము ఉంటున్న ఈ కాలనీలు నగరంలో కలిసిపోయి 20 ఏళ్లు అయినా, ఈ కాలనీల్లో 11వేల జనాభా ఉన్నా కూడా ఇప్పటికీ మౌలిక సదుపాయాలు కల్పించలేదని అన్నారు. సమస్యలపై ఎవరిని అడిగినా పట్టించుకోకపోవడంతో తమలో తాము బాధపడుతున్నామని, ఇలాంటి పరిస్థితిలో ఆంధ్రజ్యోతి ముందుకు వచ్చి తమ సమస్యలను ఎమ్మెల్యేలు, అధికారులుకు తెలియజేయడంపట్ల కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. తమ సమస్యలను వినేందుకే అధికారులు, ప్రజాప్రతినిధులు తమ దగ్గరకే రావడంతో వారు ఆంధ్రజ్యోతికి ధన్యవాదాలు తెలిపారు.

ఆ కార్యక్రమంలో తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు కె. పార్వతమ్మ, 29వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి శ్రీనివాస్, కార్పొరేషన్ ఎస్ఈ రాజశేఖర్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కన్వీనర్ పెరుగు పురుషోత్తం రెడ్డి పాల్గొన్నారు.



విజయనగర్‌లో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలను పరిశీలించి వెంటనే పరిశుభ్రం చేయాలని ఆదేశిస్తున్న ఎమ్మెల్యే



చర్చా వేదికలో ప్రజాప్రతినిధులు, అధికారులు

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి: కలెక్టర్



కర్నూలు కలెక్టరేట్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళ వారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ ఫిబ్రవరి 10వ తేదీ నుంచి 20 వరకు జరుగుతాయని, 91 పరీక్ష కేంద్రాల్లో 15,194 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. పబ్లిక్ పరీక్షలు మార్చి 1 నుంచి మార్చి 20వ తేదీ వరకు 69 సెంటర్లలో 45,325 (మొదటి సంవత్సరం-23,098 మంది, రెండో సంవత్సరంలో 22227 మంది) విద్యార్థులు హాజరవుతున్నారని అన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పరిసరాల్లో ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఫస్ట్ ఎయిడ్ కిట్స్, అవసరమైన మందులు ఏర్పాటు చేయాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేయాలని డీఆర్వోను ఆదేశించారు. 8 పరీక్ష కేంద్రాలకు బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ ఆర్ఎంను కలెక్టర్ ఆదేశించారు. అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో టీకే వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, డీఎస్పీ మహబూబ్ బాషా, ఆర్ఐవో గురువయ్యశెట్టి, డీవీఈవో పరమేశ్వరరెడ్డి, పరీక్షల స్పెషల్ ఆఫీసర్ లాలెప్ప, ఎస్ఎస్ఏ పీవో శ్రీనివాసులు, ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉర్దూ వర్సిటీ అభివృద్ధికి సహకారం

ప్రభుత్వ మైనార్టీ సలహాదారు మహమ్మద్ షరీఫ్ అహమ్మద్

కర్నూలు అర్బన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీకి ప్రభుత్వ సహకారం ఉంటుందని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షరీఫ్ అహమ్మద్ అన్నారు. మంగళవారం అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీని సందర్శించారు. ఇన్‌చార్జి ఉపకులపతి పిఎస్ షావలీఖాన్, రిజిస్ట్రార్ లోక్‌నాథ్ పుష్పగుచ్ఛం ఇచ్చి ఆహ్వానించారు. పవర్ పాయింట్ ద్వారా అభివృద్ధి, నిలిచిన నిర్మాణాలకు నిధుల అవశ్యకత, ప్రస్తుత పరిస్థితి, విద్యార్థుల విజయాలు తదితర అంశాలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీకి కావాల్సిన మౌలిక వసతులను కల్పించేందుకు సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళతామని అన్నారు. వసతి గృహం, రెగ్యులర్ సిబ్బంది నియామకం, పిహెచ్‌డీ కోర్సులకు అవకాశాలు కల్పించాలని, లైబ్రరీలో పోటీ పరీక్షల పుస్తకాలు, సైన్స్ ల్యాబ్ ఏర్పాటు, కొత్త కంప్యూటర్లు సమకూర్చాలని, పెండింగ్ సమస్యలు పరిష్కరించడంతో పాటు తదితర మౌళిక వసతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థుల కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఒకేషనల్, టెక్నికల్ ఎడ్యుకేషన్ సెంటర్లు ఏర్పాటుకు కృషి చేస్తున్నామని వీసీ వివరించారు. కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు కూడా త్వరలోనే చెల్లించేందుకు పరిష్కారం మార్గం చర్యలు చేపట్టాలని అధికారులను ఆయన ఆదేశించారు. గత ప్రభుత్వ హయంలో నిర్లక్ష్యానికి గురైన ఉర్దూ యూనివర్సిటీ పెండింగ్ నిర్మాణాల కోసం నిధులను సీఎంతో మాట్లాడి మంజూరు చేసేందుకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ముస్తాక్ అహ్మద్, కర్నూలు ఆర్డీవో అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహమ్మద్ షరీఫ్ అహమ్మద్

268 మంది ఎంపిక



పరుగు పరీక్షలో పాల్గొన్న అభ్యర్థులు

కర్నూలు క్రైం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుళ్ల నియామక దేహదారుఢ్య పరీక్షలు మంగళవారం 17వ రోజు కొనసాగింది. స్థానిక ఏపీఎస్‌పీ రెండో బెటాలియన్‌లో నిర్వహించే ఈ పరీక్షలకు నంద్యాల ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా పర్యవేక్షించారు. ఈ పరీక్షకు 600 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా.. 569 మంది అభ్యర్థులు బయోమెట్రిక్‌కు హాజరయ్యారు. వీరికి సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ తర్వాత ఎత్తు ఫిజికల్ మెజర్మెంట్ టెస్టులు నిర్వహించారు. అనంతరం వీరికి నిర్వహించిన ఫిజికల్ ఎఫీషియన్సీ టెస్టులు 1600 మీటర్ల పరుగు పరీక్షలో 317 మంది అర్హత సాధించారు. 100 మీటర్ల పరుగులో 126 మంది అర్హత సాధించారు. లాంగ్‌జంప్‌లో 261 మంది అర్హత సాదించారు. కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్షకు 17వ రోజు 268 మంది అర్హత సాధించారు. కార్యక్రమంలో హోంగార్డు కమాండెంట్ సదరన్ రీజియన్ మహేష్ కుమార్, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి.హుశేన్ పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, డీపీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తెల్లారిన బతుకులు

- గ్యాస్ లీకేజీ ఘటనలో నానమ్మ, మనవడి దుర్మరణం
- 9 మందికి గాయాలు
- కుప్పకూలిన మూడు ఇళ్లు
- రూ.24 లక్షల ఆస్తి నష్టం
- చాపిరేవులలో విషాదం



కుప్పకూలిన ఇళ్లు

వివరాలు 5లో

20 సూత్రాల కార్యక్రమాలను నిర్వహించండి

చైర్మన్ లంకా దినకర్

4

ఇన్ని సమస్యలు

కర్నూలు ఎడ్యుకేషన్/న్యూసిటీ/ కర్నూలు క్రైం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమంలో కొన్ని సమస్యలను అధికారులు వెంట వెంటనే పరిష్కరించారు. వీధిలైట్ల మరమ్మతులు, తాగునీరు పైపులైన్ల మరమ్మతులకు వెంటనే చర్యలు చేపట్టారు. అలాగే కాలనీలో ఆకతాయిల బెడద, మందుబాబుల ఆగడాలపై మంగళవారం సాయంత్రం నుంచే చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇచ్చారు. కొన్ని కాలనీలను కలిపే రోడ్లకు రూ.2 లేదా 3 లక్షలతో గ్రావెల్ రోడ్లు వేయించడం, వీధి లైట్లు ఏర్పాటు చేయడం వంటి చర్యలు వెంటనే తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ హామీ ఇచ్చారు. ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన పిచ్చి మొక్కలను తొలగించేందుకు ఎక్స్‌కవేట ర్‌ను పంపించి క్లీన్ చేయిస్తామన్నారు. కల్వర్టులలు, కాలువల క్లీనింగ్ కోసం వీలైనంత ఎక్కువ మంది సిబ్బందిని ఏర్పాటు చేస్తామని అన్నారు. కాలనీ వాసులు చెప్పిన ప్రతి సమస్యను అధికారులు నోట్ చేసుకున్నారు.

సమస్యల వెల్లువ :ఆంధ్రజ్యోతి వినూత్న రీతిలో చేపట్టిన అక్షరమే అండగా.. పరిష్కారమే అజెండాగా కార్యక్రమానికి రుక్మిణి నగర్, వాసు నగర్, సాయినాథ్ నగర్, విజయ నగర్, ఉద్యోగ నగర్, సొసైటీ కాలనీ తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యారు. ఈ సదస్సులో సుమారు 28 మంది తమ తమ కాలనీలోని సమస్యలపై స్పందించారు. సమస్యలను వెంటనే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను, కమిషనర్‌ను కోరారు. 20 ఏళ్ల కింద ఈ కాలనీలు ఏర్పాటయ్యాయని, ఏ ఒక్కరూ ఇలా ముందుకు వచ్చి సమస్యలు వినలేదని ప్రజలు అన్నారు. డ్రైనేజీ, కుక్కల బెడద, మరి కొందరు ఆకతాయిలు, దొంగతనాల బెడద, విద్యుత్, తాగునీటి సమస్యలు, పాము సమస్యలవంటివి పెద్ద జాబితాను కాలనీవాసులు తీసుకువచ్చారు. సదస్సులో కూర్చుని సమస్యలు వింటున్న ఎమ్మెల్యే, కమిషనర్‌లు సైతం ఇన్ని సమస్యలు ఉన్నాయా అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ ఆర్జీవీ కృష్ణ, సిటీ ప్లానర్ ప్రదీప్, నాలుగో పట్టణ ఎస్ఐ గోపీనాథ్, శారద స్కూల్ కరస్పాండెంట్ జి.నందిని, సత్యసాయి సప్లయర్స్ అధినేత రామకృష్ణ, ఆంధ్రజ్యోతి బ్యూరో ఇన్‌చార్జి గోరంట్ల కొండప్ప, అడ్వర్‌టైజ్‌మెంట్ మేనేజర్ గోపాల్, డిప్యూటీ సర్క్యులేషన్ మేనేజర్ సోమశేఖర్‌రెడ్డి, ఏబీఎన్ ప్రతినిధి సుంకన్న పాల్గొన్నారు.



నగరపాలక సంస్థ కమిషనర్‌తో కలిసి వాసునగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

సప్తగిరి కాలనీలో రోడ్డు పనులు సత్వరమే చేపట్టాలి



సప్తగిరి కాలనీకి సిమెంటు రోడ్డు మంజూరైంది. అధికారులు పనులు చేపట్టకుండా కాలయాపన చేస్తున్నారు. ఇదే విషయాన్ని పలుమార్లు స్పందన కార్యక్రమంలో కలెక్టర్, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్ళాం. మున్సిపల్ అధికారులు టెండర్లు పిలిచి పనులు చేపడుతామని చెప్పారు. ఈ పనులను ఏమైనా రద్దు చేశారా? మాకు తెలియదు. అధికారులు వివరాలు చెప్పాలి. పనులు చేయించాలి.

- కె. బజారప్ప, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు

డ్రైనేజీ అస్తవ్యస్తం



72, 73 సచివాలయాల పరిధిలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. అరుణానగర్‌లోని కాలువలు చిన్నగా ఉండటంతో మురుగునీరు వీధుల్లో పారుతోంది. కాలనీలోని ఖాళీ స్థలాల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్త వేస్తున్నారు. దీంతో దోమలబెడదను భరించలేకపోతున్నాము. అలాగే 29 వార్డు పరిధిలో అర్హులైన నిరుపేదలకు వడ్డీ లేని రుణాలు అందడం లేదు. నేషనల్ హైవేలో రాత్రివేళల్లో లైట్లు వెలగడం లేదు.

- వీరప్ప, బీజేపీ ఓబీసీ నాయకుడు

తాగునీరు అందించాలి



శరీన్‌నగర్‌లో ప్రజలకు తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో నివసించేవారంతా కూలీ చేసుకుని జీవించేవారే. ముఖ్యంగా మధ్యాహ్నం సమయంలో తాగునీరు విడుదల చేస్తున్నారు. పనులకు వెళ్లడంతో తాగునీరు పట్టుకోలేకపోతున్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అమృత్ పథకం ద్వారా తాగునీటి కోసం రూ.120 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో గోరుకల్లు రిజర్వాయర్, హంద్రీ కాలువ నుంచి నీటిని సరఫరా చేసి కాలనీవాసులకు తాగునీరు పుష్కలంగా అందించాలి. వేసవిలో తాగునీటి సమస్య నుంచి ప్రజలను గట్టెక్కించాలి. పందిపాడు, లక్ష్మీపురం మధ్య రోడ్డును నిర్మించాలి.

- కొట్టె చెన్నయ్య, రిటైర్డు ప్రిన్సిపాల్, బీజేపీ నంద్యాల జిల్లా అధికార ప్రతినిధి

ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలి



శరీన్‌నగర్ నుంచి జాతీయ రహదారి మీదుగా రిజిస్ట్రార్ ఆఫీసుకు వెళ్లడం చాలా కష్టంగా ఉంది. ఇక్కడ ఒక ఫ్లైఓవర్ బ్రిడ్జి నియమించాలి. ప్రతి రోజు విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, కూలీలు, ఇతర పనులకు శరీన్‌నగర్ నుంచి జాతీయ రహదారి దాటుకుని వెళ్లడానికి అవస్థ పడుతున్నారు. ఒక్కోసారి ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి.

-శ్రీనివాసరావు

డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉంది



కాలనీలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉంది. కాలువలు లేకపోవడంతో మురుగునీరంతా రోడ్లపైకి వచ్చి దుర్వాసన వెలజల్లుతోంది. దీంతో దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నాం.

-సుంకన్న

పైపులైన్ పగిలిపోయింది.



పార్థసారధి నగర్‌లో నీటి సమస్య తీవ్రంగా ఉంది. పైపులైన్ పగిలిపోయి నీరంతా వృధాగా పోతోంది. కాలువలు వారానికి ఒక్కసారి శుభ్రం చేస్తున్నారు. సనత్‌నగర్‌లోని ఖాళీస్థలంలో చెత్తను పడేసిపోతున్నారు.

-సద్దాంహుస్సేన్

పార్కు ఏర్పాటు చేయాలి



విజయనగర్ కాలనీలో అన్ని సమస్యలే ఉన్నాయి. ప్రధానంగా ఉదయం, సాయంత్రం ఆహ్లాదకరమైన వాతావరణం కోసం పార్కు ఏర్పాటు చేయాలి. పార్కు లేకపోవడంతో చిన్నారులు బయట ఆడుకుంటూ వాహనాల కింద పడి దెబ్బలు తగిలించుకుంటున్నారు.

-రవికుమార్

అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలి



కాలనీలోని వాటర్ ట్యాంకు వద్ద లైట్లు లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలు ఎక్కువగా జరుగుతున్నాయి. తాగుబోతులు అక్కడే ఉండటంతో మహిళలు, చిన్నారులు అటువైపు వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. దోమల బెడద నుంచి రక్షించండి. జిల్లా పరిషత్ పాఠశాల వద్ద ఆకతాయిలు ఎక్కువగా ఉంటున్నారు.

- షబ్బీర్

నీటి సమస్య పరిష్కరించాలి



సప్తగిరి నగర్‌లో నీటి సమస్యను పరిష్కరించాలి. అదే విధంగా రోడ్లు, కాలువలు నిర్మించాలి. ఎన్నో ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నాం. అయినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు.

-అరుణకుమారి

ఇళ్ల ముందు చెత్తను పడేస్తున్నారు



శారదపాఠశాల వెనకాలే మా ఇల్లు ఉంది. అక్కడ కేవలం రెండు ఇళ్లు మాత్రమే ఉన్నాయి. మిగతా అంతా ఖాళీ స్థలమే. దీంతో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఉదయం, రాత్రి సమయాల్లో చెత్త పడేస్తున్నారు. రాత్రి పూట తాగుబోతులు ఈ ఖాళీ స్థలంలో కూర్చుని మందు తాగుతున్నారు.

-లలితమ్మ



కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

ఇప్పటికైనా పరిష్కరించండి

'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా'లో ప్రజల వినతి

నంద్యాల, జనవరి 28, (ఆంధ్రజ్యోతి): ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలని ప్రజలు ప్రజాప్రతినిధులు, అధికారులను ఆంధ్రజ్యోతి చేపట్టిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' చర్చా వేదికలో కోరారు. ఆంధ్రజ్యోతి యాజమాన్యం ఇటువంటి బృహత్తర కార్యక్రమం చేపట్టడంపై ఆయా కాలనీల ప్రజలు, ప్రజాప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆయా కాలనీల ప్రజలు ఎంతో ఉత్సాహంగా వచ్చి స్వచ్ఛందంగా తమ సమస్యలను తెలియ జేశారు. ఇప్పుడైనా తమ సమస్యలు పరిష్కారమైతే ఆంధ్ర జ్యోతికి రుణపడి ఉంటామని ఆయా కాలనీల ప్రజలు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. నగర శివారు కాల నీలో సమస్యలన్నీ ఒక్కసారిగా ఈ వెలుగులోకి వచ్చా యి. వీటన్నిటినీ పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు.



కార్యక్రమానికి హాజరైన ప్రజలు

సమస్యల పరిష్కారానికి కృషి



వార్డుల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం. గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళ్తాం. ప్రధానంగా మంత్రి చొరవతో 37,38 వార్డుల అభివృద్ధికి కృషి చేస్తాం.

- ఖలీల్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు

అభివృద్ధి చేయాలి



గతంలో మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఇచ్చిన హామీల ప్రకారం కాలనీని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలి. ఇటీవల కూడా పర్యాటించి వెళ్లారు. త్వరలోనే చేస్తామని కూడా చెప్పారు. మా సమస్యలను త్వరగా పరిష్కారిస్తే ఎప్పటికి తమకు ఋణపడి ఉంటాం.

-బాబురావు, నందమూరినగర్

రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలి



ఏళ్ల తరబడి కాలనీలో రోడ్లు గుంతలమయంగా.. డ్రైనేజీలు లేకపోవడంతో ఎక్కడిక్కడ రోడ్లపై మురుగునీరు చేరుతోంది. తద్వారా దుర్వాసన రావడంతో పాటు దోమల బెడద ఎక్కువైంది. రోడ్లు, డ్రైనేజీలు త్వరగా నిర్మించాలి.

-అనూష, వైఎస్సార్ కాలనీ

విష పురుగులు వస్తున్నాయి



కాలనీలో చాలా ప్రాంతాల్లో ఇల్లు నిర్మించకపోవడంతో ఖాళీగా ప్లాట్లు ఉన్నాయి. దీంతో ఆయా ప్లాట్లలో పిచ్చిమొక్కలు పెరిగి పాములు, తేళ్లు వస్తున్నాయి. బయటకు రావాలంటే భయంగా ఉంది. త్వరలో పిచ్చిమొక్కలను తొలగించి ప్రజలకు రక్షణ కల్పించాలి.

-ఇజ్రాయిల్, నందమూరినగర్

శ్మశానానికి రోడ్డు వేయాలి



కాలనీలో శ్మశానానికి వెళ్లడానికి కూడా రహదారి సక్రమంగా లేదు. వర్షాకాలం వస్తే ఇబ్బందికరంగా ఉంది. కావున మా సమస్యపై స్పందించి తాత్కాలిక రోడ్డును నిర్మించాలి.

- సురేష్ కుమార్, వైఎస్సార్ కాలనీ

మహిళలకు ఉపాధి కల్పించాలి



కాలనీలో చాలా మంది పేదవారు ఉన్నారు. మహిళలకు ఉపాధి సౌకర్యం లేదు. కావున స్థానికంగా మహిళలకు ప్రత్యేక పరిశ్రమ ఏర్పాటు చేసి అండగా నిలవాలి. పొదుపు మహిళలకు భవనం నిర్మించాలి.

-సుజాత, వైఎస్సార్ కాలనీ

దోమల నివారణ చర్యలు తీసుకోవాలి



మా కాలనీలో చాలా చోట్ల మురుగునీరు రోజుల తరబడి నిల్వ ఉంది. దోమలు ఎక్కువగా ఉన్నాయి. దీంతో జ్వరాల బారిన పడుతున్నారు. కావున తరచూ ఫాగింగ్ చేసి దోమలు లేకుండా చూడాలి. ఈ కాలనీలకు సంబంధిత శాశ్విత డ్రైనేజీ సౌకర్యం కల్పించాలి.

-లక్ష్మీనారాయణ, నందమూరినగర్

అల్లరిమూకలు ఆగడాలు ఎక్కువయ్యాయి



నందమూరినగర్‌లోని టైలర్స్ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి వెంబడి అల్లరి మూకలు ఆగడాలు ఎక్కువయ్యాయి. రాత్రి పూట వెళ్లాలంటే భయంగా ఉంది. మహిళలకు మరీ ఇబ్బందిగా ఉంది. పోలీసుల గస్తీ ఏర్పాటు చేయాలి.

- వలి, నందమూరినగర్

అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలి



కాలనీలో చాలా వరకు బుడగ జంగాల కులానికి చెందిన వారు జీవిస్తున్నాం. మాకు అంగన్‌వాడీ స్కూల్ లేదు. మా పిల్లలకు ఇబ్బందిగా ఉంది. కావున మా సమస్యపై స్పందించి అంగన్‌వాడీ స్కూల్ ఏర్పాటు చేయాలి.

-ప్రసాద్, వైఎస్సార్ కాలనీ

రోడ్డు సౌకర్యం లేదు



వైఎస్ఆర్‌కాలనీ నుంచి టైలర్స్ కాలనీకి వెళ్లే రహదారి గుంతలమయంగా ఉండటంతో పాటు రోడ్డు వెంబడి ముళ్ల కంప ఏపుగా పెరిగిపోయాయి. రాత్రి వేళ వెళ్లాలంటే భయంగా ఉంది. వీధిలైట్లు కూడా లేవు. కావున ఈ సమస్యను త్వరగా పరిష్కరించాలి.

- మంజుల, వైఎస్సార్ కాలనీ

1న ఇళ్ల పంపిణీ

కర్నూలు కలెక్టరేట్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 1వ తేదీన జిల్లాలో పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు అందించే కార్యక్రమాన్ని చేపట్టాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులకు అందించే కార్యక్రమం నిర్వహణపై ఎంపీడీవోలతో, హౌసింగ్ ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 1న ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేయడంతో పాటు రాష్ట్రంలో లక్ష ఇళ్ల నిర్మాణాలలో భాగంగా జిల్లాలో పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు అందించే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. టెలి కాన్ఫరెన్స్‌లో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

20 సూత్రాల కార్యక్రమాలను నిర్వహించండి




సమావేశంలో మాట్లాడుతున్న లంకా దినకర్

నంద్యాల కల్చరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్య సాధన దిశగా 20 సూత్రాల కార్యక్రమాన్ని పటిష్ఠంగా అమలు చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని 20 సూత్రాల పార్ములా కమిటీ చైర్మన్ లంకా దినకర్ జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో 20 సూత్రాల కార్యక్రమాల అమలుపై వివిధ శాఖల జిల్లా అధికారులతో చైర్మన్ సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, కలెక్టర్ రాజకుమారి, జేసీ విష్ణుచరణ్, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, సీపీవో వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు. లంకా దినకర్ మాట్లాడుతూ పీఎం నరేంద్రమోదీ వికసిత్ భారత్ లక్ష్యంగా నిర్దేశించుకుని కార్యాచరణ ప్రణాళిక రూపొందించి వికసిత్ నంద్యాల జిల్లాగా రూపుదిద్దేందుకు అధికార యంత్రాంగం కృషి చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.113 కోట్ల రూపాయలకు గాను రూ.92 కోట్లు ఖర్చుపెట్టారని ఇంకా రూ.21 కోట్లు ఖర్చుచేయాల్సి ఉందని నిధులు మురిగిపోకుండా ప్రణాళిక విధంగా ఖర్చు చేయాలని అధికారులను ఆదేశించారు. గత 5 సంవత్సరాలలో మెటీరియల్ కాంపోనెంట్ వ్యయంలో తేడాలు ఉన్నందున విచారణ చేయాల్సిందిగా చైర్మన్ కలెక్టర్‌ను సూచించారు. ఉపాధి వేతన దారుల కూలీ రూ.300 రూపాయలు అయితే జిల్లాలో సగటున రూ.246 మాత్రమే ఉందని, దినసరి సరాసరి రేటును పెంచేందుకు సరైన చర్యలు తీసుకోవాలని అన్నారు. జలజీవన్ మిషన్ కింద రూ. 400 కోట్లతో 1568 పనుల ప్రారంభించగా అందులో 1203 పనులు రద్దుచేసింద న్నారు. టిడ్కో గృహాలలో మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన నిధులను ప్రభుత్వానికి నివేదించి పనులు చేపట్టాలన్నారు. పట్టణ ప్రాంతాలలో ప్రతి ఇంటికి సురక్షిత తాగునీటి సరఫరా కోసం అమృత్-1 కింద158 కోట్ల అంచనాలతో కేటాయించిన 98 పనులకుగాను రూ.144 కోట్లు ఖర్చు చేసారని పెండింగ్లో ఉన్న పనులను వెంటనే పూర్తిచేయాలని ఆదేశించారు. నంద్యాలలో 72వేల గృహాలకు 69వేల కొళాయి కనెక్షన్లు ఉన్నాయని మిగిలిని వాటికికూడా వెంటనే పూర్తిచేయాలని ఆదేశించారు. డోన్ మున్సిపాలిటీలో అమృత్-2 ద్వారా నీటి సరఫరా కోసం రూ. 23.56 కోట్లు, బేతంచెర్లలో 45 కోట్లు కేటాయించారని పనులు వేగవంతంచేసి తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఇంజనీర్లను ఆదేశించారు. పీఎం ఫసల్ బీమా యోజన పథకం కింద గత 5 సంవత్సారాల్లో నష్టపోయిన రైతులకు ఆర్థిక ప్రయోజనాలు అందలేదన్నారు. ప్రతి యూరియా బ్యాగ్‌పై 2వేల రూపాయలు కేంద్ర ప్రభుత్వం ఇస్తుందన్నారు. నల్లమల్ల అడవులో వైల్డ్‌లైఫ్ సెంచురీ, జంగిల్ సఫారీకి అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించి పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. జిల్లాలోని 11300 వీధి వ్యాపారులకు రుణాలు మంజూరుచేసి ఆదుకోవాలని అన్నారు. ఎంపీ శబరి మాట్లాడుతూ కొత్తపల్లి మండలంలో సిద్ధేశ్వరం వద్ద కృష్ణానదిపై తీగల వంతెన బదులు బ్రిడ్జి కం బ్యారేజ్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు.

చైర్మన్ లంకా దినకర్

తెల్లారిన బతుకులు

- గ్యాస్ లీకేజీ ఘటనలో నానమ్మ, మనవడి దుర్మరణం
- 9 మందికి గాయాలు
- అధిక పీడనంతో కుప్పకూలిన మూడు ఇళ్లు
- రూ.24 లక్షల ఆస్తి నష్టం
- చాపిరేవులలో విషాదం



క్షతగాత్రులను వెలికి తీసున్న సిబ్బంది


మృతులు


రోదిస్తున్న మహిళ

నంద్యాల క్రైం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కూలి పనులకు వెళితేగాని పొట్ట నిండని బతుకులు.. సోమవారం కూలి పనులకు వెళ్లి రాత్రి నిద్రకు ఉపక్రమించారు. తెల్లారి వంట చేసుకొని పనికి వెళ్లాల్సిన నానమ్మ, బడికి వెళ్లాల్సిన మనవడిని మరణం వెంటాడింది. వెంకటమ్మ తెల్లవారు జాము 4గంటలకు లేచి ఇంట్లో లైట్ వేయడంతో గ్యాస్ లీకేజీవల్ల ఏర్పడిన అధిక పీడనంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. అధిక పీడనంతో పక్కనే ఉన్న ఆమె కుమారులకు చెందిన మరో రెండు ఇళ్లు కుప్పకూ లడంతో ఆ శబ్దానికి ఒక్కసారిగా చాపిరేవుల గ్రామం ఉలిక్కిపడింది. ఈ ప్రమాదంలో వెంకటమ్మ అక్కడి కక్కడే మృతిచెందగా ఆమె మనవడు కుప్పకూలిన శిథిలాల మధ్య ఇరుక్కుపోయి మృత్యువాత పడ్డాడు. 9 మంది కాలిన గాయాలతో పాటు శ్లాబ్‌లు కూలి నిద్రి స్తున్న వీరిపై పడడంతో తీవ్ర గాయాలకు గురయ్యారు. ఈ విషాదకర ఘటన నంద్యాల మండలం చాపిరేవుల గ్రామంలో జరిగింది.

నంద్యాల మండలం చాపిరేవుల గ్రామంలో మంగళవారం తెల్లవారుజా ము 4గంటల సమయంలో ఇంట్లో గ్యాస్ లీకేజీ అయిన ఘటనలో ఇద్దరు మృత్యువాత పడ్డారు. మరో 9మంది కాలిన గాయాలు అయ్యాయి. వీరిని నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి తీవ్రంగా ఉన్న వారికి మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వెంకటమ్మ(62), ఆమె ఇద్దరు కుమారులు సుబ్బరాయుడు, లింగమయ్య విడివిడిగా మూడు ఇళ్లు నిర్మించుకొని జీవనం సాగిస్తున్నారు. వెంకటమ్మ నివాసం ఉండే ఇంట్లో సోమవారం రాత్రి వంట చేసుకున్నారు. రాత్రి భోజనం అనంతరం నిద్రకు ఉపక్రమించారు. అయితే మంగళవారం తెల్లవారుజామున 4గంటల సమయంలో వెంకటమ్మ తన ఇంట్లో లైట్ ఆన్ చేశారు. అయితే అప్పటికే గ్యాస్ లీకేజీ కారణంగా ఒక్కసారిగా అధిక పీడనం కారణంగా మంటలు చెలరేగాయి. ఘటన జరిగిన ఇంటిగోడపారును ఆనుకుని పక్కనే ఉండే మృతురాలి కుమారుడు సుబ్బరాయుడు ఇల్లు గ్యాస్ లీకేజీవల్ల ఏర్పడిన అధిక పీడనంవల్ల శ్లాబ్ కుప్పకూలడంతో బాలుడు దినేష్ (10) శిథిలాల మధ్య ఇరుక్కుపోయి మరణించాడు.

చుట్టపు చూపుగా వచ్చి గాయాలపాలు

సుబ్బరాయుడు ఇంట్లో తన భార్య రామలక్ష్మి, మరో కుమారుడు కార్తీక్ ఉంటున్నారు. వారింటికి చుట్టపు చూపుగా వచ్చిన సుబ్బరాయుడు బంధువులు బేతంచెర్ల మండలం వెంకటగిరికి చెందిన సుబ్బమ్మ, ఆమె కుమారుడు రాములు కూడా తీవ్రంగా గాయపడ్డారు. అలాగే మృతురాలి మరో కుమారుడైన లింగమయ్య ఇల్లు కూడా అధికపీడనం ధాటికి కుప్పకూలింది. ఈ ఇంట్లో ఉన్న లింగమయ్యతోపాటు భార్య వెంకటేశ్వర మ్మ, సుశాంత్, సుధీర్ కూడా తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న నంద్యాల రూరల్ తహసీల్దార్ పత్తి శ్రీనివాసులు, తాలుకా సీఐ ఈశ్వరయ్య, అగ్నిమాపక దళ అధికారి యోగేశ్వరరెడ్డి సిబ్బందితో చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాలకింద చిక్కుకున్న వెంకటమ్మ, దినేష్ మృతదేహాలను మూడు గంటల పాటు శ్రమించి వెలికి తీశారు. క్షతగాత్రులను ప్రభుత్వ ఆస్ప త్రికి తరలించారు. అనంతరం ప్రమాద తీవ్రతను అంచనా వేశారు. రూ.24లక్షల ఆస్తినష్టం జరిగిందని అగ్నిమాపక దళ అధికారి తెలిపారు. తాలుకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సుబ్బరాయుడు కుటుంబంలో విషాదం

సుబ్బరాయుడుకు ఇద్దరు సంతానం. వారిలో పెద్ద కుమారుడు కార్తీక్. చిన్న కుమారుడు దినేష్. పెద్ద కుమారుడు కార్తీక్‌కు చిన్నప్పుడే గుండెకు రంధ్రం పడటంతో దాతల సహాయంతో ఆపరేషన్ చేయిం చారు. అయినా పూర్తిస్థాయిలో మెరుగైన ఆరోగ్య పరిస్థితి లేకపోవడంతో ఇప్పటికీ నెలనెలా ఆస్పత్రుల చుట్టూ తిరుగుతూ మనోవేదన పడేవాడు. అయితే మంగళవారం తెల్లవారుజామున జరిగిన గ్యాస్ లీకేజీ ఘటనలో చిన్న కుమారుడు దినేష్ మృతిచెందడంతో సుబ్బరాయుడు రోదన గ్రామస్థులకు కంటతడి పెట్టిం చింది. సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్న చిన్న కుమారుడిని పోగొట్టుకొని అనారోగ్యంతో ఉన్న పెద్ద కుమారుడి ఆరోగ్య పరిస్థితిని తలచుకుంటూ సుబ్బరాయుడు దంపతులు కుమిలిపోతున్నారు.

గ్యాస్ సిలిండర్లు పేలి గుడిసెల దగ్ధం

- కట్టుబట్టలతో మిగిలిన బాధితులు


కాలిపోతున్న గుడిసెలు

ఆదోని, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గణేష్ సర్కిల్ సమీపంలోని జాలర్ల వీధిలోని రెండు గ్యాస్ సిలిండర్‌లు పేలి రెండు పూరి గుడిసెలు దగ్ధం అయ్యాయి. వివరాలివీ.. జాలర్ల కాలనీలో నివాసముంటున్న గంగమ్మ తెల్లవారుజామున నాలుగు గంటలకే వంట పని ముగించుకొని కూలీ పనులకు వెళ్లింది. ఉదయం ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలడంతో మంటలు వ్యాపించాయి. పక్కనే ఉన్న గంగమ్మ చెల్లెలు లక్ష్మి గుడిసెకు కూడా మంటలు వ్యాపించాయి. ఆ ఇంట్లో ఉన్న సిలిండర్ కూడా ఒకసారిగా పేలింది. గంగమ్మ భర్త నెల రోజుల క్రితం చనిపోయారు. ఆమెకు కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. వీరు కూడా గంగమ్మ వెంట వెళ్లారు. లక్ష్మి భర్త ఎనిమిది నెలల క్రితం భర్త చనిపోయారు. ఆమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిద్దరూ లక్ష్మి పనికి వెళ్లడంతో ఆమె వెంటే వెళ్లారు. రెండు గుడిసెల్లో ఉన్న నగదు, బంగారు, వెండి ఆభరణాలు కాలిపోయాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. కట్టు బట్టలతో మిగిలామని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. స్థానికులు మాట్లాడుతూ అగ్నిమాపక కార్యాలయానికి ఫోన్ చేస్తే త్వరగా లిఫ్ట్ చేయలేదని ఆరోపించారు. సకాలంలో ఫైర్ సిబ్బంది స్పందించి ఉంటే ఇంత పెద్ద మొత్తంలో ఆస్తి నష్టం సంభవించి ఉండేది కాదని అన్నారు.

సచివాలయ అడ్మిన్ సెక్రటరీలకు మెమో

కర్నూలు న్యూసిటీ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలో పన్ను వసూళ్లలో అలసత్వం వహించినందుకు 103 మంది సచివాలయ అడ్మిన్ సెక్రటరీలకు అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవి. కృష్ణ మెమో జారీ చేశారు. కుళాయిలు, దుకాణాల పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం వహించడంతో జారీ చేశారు. 23 మంది సెక్రటరీలు ఒక్క పైసా కూడ వసూలు చేయలేదు. మిగిలిన 70 మంది 50 శాతాని కంటే తక్కువగా వసూలు చేశారు. ఈ మేరకు పన్ను వసూళ్లలో పురోగతి పెంచాలని ఏసీ ఆదేశించారు.

దొంగనోట్ల కేసులో నలుగురికి జైలు శిక్ష

నంద్యాల క్రైం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): బండిఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో 2017లో నమోదైన దొంగనోట్ల కేసులో నిందితులు నలుగురికి ఏడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.8వేల జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ ఏఎస్‌జే కోర్టు జడ్జి రాధారాణి మంగళవారం తీర్పునిచ్చారు. కేసులో నిందితులైన బండిఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన షేక్ రషీద్, సుధాకర్, కరీమ్, వెంకటేశ్వర్లు 2017లో మండలంలో దొంగనోట్లు చెలామణి చేస్తుండగా బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టులో నలుగురు నిందితుల నేరం రుజువు కావడంతో నలుగురికి ఏడు సంవత్సరాల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.8వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు. కేసులో మొత్తం ఆరుగురు నిందితులు ఉండగా కేసు విచారణ సమయంలో ఇద్దరు నిందితులు మృతిచెందారని పోలీసులు తెలిపారు. జడ్జి తీర్పుతో ముద్దాయిలను నంద్యాల సబ్ జైల్‌కు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

గ్యాస్ సిలిండర్ల చోరీ


తాళం పగులగొట్టిన దృశ్యం

నందికొట్కూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మారుతి నగర్‌లోని ఓ ఇంట్లో మూడు సిలిండర్లు దొంగతనానికి గురయ్యాయి. బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హసీనా అనే మహిళ పిల్లలతో కలిసి హైదరాబాదులోని బంధువుల ఇంటికి వెళ్లారు. తలుపులు తెరుచుకొని ఉండడాన్ని గమనించిన పక్కింటి వారు ఆమెకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. దీంతో ఆమె హైదరాబాదు నుంచి వచ్చి చూస్తే ఇంట్లో రెండు నిండు సిలిండర్లు, ఒక ఖాళీ సిలిండర్ దొంగతనానికి గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మహానందిలో చిరుత సంచారం


చిరుత పాదముద్రలు

మహానంది, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్ర పరిసరాలలో మంగళవారం ఉదయం చిరుతపులి సంచారాన్ని చూసిన ఉపాధి కూలీలు పరుగులు తీశారు. నిత్యాన్నదాన సత్రం వెనుక కాల్వలో పనులు నిర్వహిస్తున్న ఉపాధికూలీలకు చిరుత అడుగులు కనిపించాయి అలాగే సుదూరప్రాంతంలో చిరుత కనిపించడంతో బయాందోళతో పరుగులుతీశారు. ఈ విషయాన్ని పీల్డ్ అసిస్టెంట్ సురేష్ ఉన్నతాదికారులకు తెలుపడంతో పనులు నిలిపివేసి ఉపాధి కూలీలను ఇళ్లకుపంపారు.

మహమ్మద్ షరీఫ్‌ను కలిసిన తిక్కారెడ్డి

కర్నూలు అర్బన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ సంక్షేమ శాఖ సలహాదారు మహమ్మద్ షరీఫ్‌ను టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళవారం డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డితో పాటు నాయకులు కలిశారు. అనంతరం వర్సిటీలో విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు.


షరీఫ్‌ను సన్మానిస్తున్న తిక్కారెడ్డి

ఆకతాయిల వికృత చేష్టలు

మహానంది, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆలయ పరిసరాలలోని కోనేటిలో పుణ్యస్నానాలు చేస్తున్న మహిళాభక్తుల పట్ల కర్నాటకకు చెందిన కొందరు ఆకతాయులు అసభ్యకరంగా ప్రవర్తించినట్లు తెలిసింది. మంగళవారం హైదరాబాదుకు చెందిన విజయ్ కుటుంబసభ్యులు దర్శనంకోసం మహానందికి వచ్చారు. ముందుగా కోనేటీలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తుల పట్ల కర్నాటకకు చెందిన కొందరు ఆకతాయులు కోనేరులో అసభ్యకరంగా ప్రవర్తించి ఫొటోలు తీయడానికి గమనించిన మహిళలు పోలీసులను ఆశ్రయించారు. పోలీసుల ఆకతాయుల వద్ద ఉన్న సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. వెంటనే ఆకతాయులు తమ వాహనంలో పరారయ్యారు.

వలసల నివారణకు చర్యలు తీసుకోండి

- సీజనల్ హాస్టళ్లను ఏర్పాటు చేయండి
- కలెక్టర్ రంజిత్ బాషా


మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): అధికారులు అలసత్వం వీడి వలసల నివారణకు గట్టి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎంపీడీవో ఉపాధి హామీ ఏపీడీలు, ఏపీవోలను ఆదేశించారు. మంగళవారం ఉపాధి హామీ పథకం అమలు, వలసల నివారణ అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వలసలు వెళ్తున్న గ్రామాలకు ఏపీవోలు, ఎంపీడీవోలు టీమ్‌లుగా వెళ్లి కూలీలతో మాట్లాడి ఉపాధి హామీ పనుల కల్పన, వేతనం గురించి వివరించా లన్నారు. అట్లాగే వలసల వల్ల పిల్లల చదువులకు భంగం కలుగుతుందని అవగాహన కల్పించాలన్నారు. వారికి రెండు వారాల్లో పూర్తి స్థాయిలో పనులు కల్పించకపోతే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. విద్యార్థులకు సీజనల్ హాస్టళ్లు ఏర్పాటు చేయాలని అన్నారు. ఉపాధి హామీ ఏపీడీలు సక్రమంగా పని చేయడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. డివిజన్ల వారిగా ఈ రెండు నెలల యాక్షన్ ప్లాన్‌ను బుధవారంలోపు సమర్పించాలని ఏపీడీలను ఆదేశించారు. డ్వామా పీడీ వెంకటరమణయ్య, అన్ని మండలాల ఎంపీడీవోలు, ఏపీడీలు, ఏపీవోలు పాల్గొన్నారు.

తిరుపతి బాధితురాలికి పరిహారం


బాధితురాలికి చెక్కు ఇస్తున్న మంత్రి భరత్

కర్నూలు అర్బన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి టోకెన్ల జారీ సందర్భంగా తిరుపతి తొక్కిసలాట బాధితులకు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ పరిహారం అందజేశారు నగరంలోని తన కార్యాలయంలో ఆలూరుకు చెందిన బోయ వెంకటలక్ష్మికి రూ. 2 లక్షల చెక్‌ను అందజేశారు. టీటీడీ సభ్యుడు మల్లెల రాజశేఖర్, ఆలూరు నియోజకవర్గం ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్‌తో కలిసి చెక్‌ను అందజేశారు.

ఆదర్శ గ్రామాలే లక్ష్యం

- వీడియో కాన్ఫరెన్సులో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ


వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న అధికారులు

కర్నూలు న్యూసిటీ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని గ్రామాలను బహిరంగ మల విసర్జన రహిత ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం విజయవాడ నుంచి ఆయన సీఈఓ, డీపీఓ, ఆర్‌డబ్ల్యూఎస్, పీడీ డ్వామా, ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. జడ్పీ మినీ సమావేశంలో పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ కృష్ణతేజ, జిల్లా పరిషత్ సీఈఓ జి. నాసరరెడ్డి, డీపీఓ భాస్కర్, డ్వామా పీడీ వెంకటరమణయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, డ్వామా శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ల ద్వారా ఇంటింటి సర్వే చేయించాలని అవసరమైన స్థల లభ్యత ఉన్న చోట వ్యక్తిగత కంపోస్టు, కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలన్నారు. పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ కృష్ణతేజ మాట్లాడుతూ ఇంజనీరింగ్ అసిస్టెంట్ల ద్వారా సర్వే చేయించి ఎన్‌ఆర్‌ఈజీఎస్, ఎస్‌బీఎంలతో వ్యక్తిగత ఇంకుడు గుంతలు, సామాజిక సోక్ పిట్స్‌ను ఏర్పాటు చేయించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతి గ్రామ పంచాయతీ మార్చి 31లోపల ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు.

క్వింటం వాము రూ.23,111

- క్రమంగా పెరుగుతున్న ఎండుమిర్చి ధర


కర్నూలు యార్డుకు వచ్చిన వాము

కర్నూలు అగ్రికల్చర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో వాము ధర రోజురోజుకు పెరుగుతుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం కర్నూలు మార్కెట్ యార్డుకు కర్ణాటకతో పాటు ఉమ్మడి కర్నూలు జిల్లా రైతులు విక్రయానికి తెచ్చారు. గరిష్ఠ ధర క్వింటానికి రూ.23,111, మధ్యస్థ ధర రూ.13,569, కనిష్ఠ ధర రూ.5,231 ధర అందినట్లు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి, అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు తెలిపారు. వేరుశనగ కాయలకు గరిష్ఠ ధర రూ.5,719, మధ్యస్థ ధర రూ.4,449, కనిష్ఠ ధర రూ1,222 పలికింది. ఎండుమిరపకాయలకు గరిష్ఠ ధర రూ.13,499, మధ్యస్థ ధర రూ.12,109, కనిష్ఠ ధర రూ.1,299కు అమ్ముడుపోయింది. అలాగే పొద్దుతిరుగుడు విత్తనాలకు గరిష్ఠ ధర రూ.4,819, మధ్యస్థ ధర రూ.4,769, కనిష్ఠ ధర రూ.4,769 రైతులకు దక్కింది. ఆముదాలు గరిష్ఠ, మధ్యస్థంగా రూ.5,621, కనిష్ఠ ధర రూ.రూ.5209 వచ్చింది. కందులకు గరిష్ఠ ధర రూ.7,801, మధ్యస్థం రూ.6,689, కనిష్ఠ ధర రూ.రూ.2,100 రైతులకు చేరింది. శనగలకు గరిష్ఠ ధర రూ.5,900, మధ్యస్థ ధర రూ.5,776, కనిష్ఠ ధర రూ.3,010 పలికింది. ఉల్లిగడ్డలకు గరిష్ఠ ధర రూ.2,368, మధ్యస్థ ధర రూ.1,5885, కనిష్ఠ ధర రూ.721 దక్కింది. కొర్రలకు గరిష్ఠ ధర రూ.2,729, మధ్యస్థ ధర రూ.2,299, కనిష్ఠ ధర రూ.2,015 రైతులకు అందినట్లు సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు.

వృత్తి విద్యతో ఉద్యోగ అవకాశాలు



విద్యార్థులతో మాట్లాడుతున్న అప్పారావు

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): వృత్తి విద్యా కోర్సులు చేసిన విద్యార్థులకు అపారమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయని వృత్తి విద్య కోర్సు అప్రెంటిషిప్ అభివృద్ధి అధికారి అప్పారావు పేర్కొన్నారు. మంగళవారం కేవీఆర్ జూనియర్ కళాశాల, బి. క్యాంపు ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో వేర్వేరుగా విద్యార్థులతో మాట్లాడారు. రాబోయే ప్రపంచమంతా వృత్తి విద్యదే అని, నైపుణ్యాలను పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. చదువుకున్న వారికి నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ తీసుకుంటే మరింత ఉద్యోగ ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవచ్చన్నారు వేర్వేరుగా జరిగిన కార్యక్రమంలో డీవీఈవో పరమేశ్వరరెడ్డి, ఆర్ఐవో గురువయ్యశెట్టి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి. లాలెప్ప, బీ. క్యాంపు ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్ పాల్గొన్నారు.

హైకోర్టు బెంచ్ కోసం చర్యలు తీసుకోండి

బార్ అసోసియేషన్ విజ్ఞప్తి



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావును కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కర్నూలు బార్ అసోసియేషన్ సభ్యులు

కర్నూలు లీగల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కర్నూలుకు హైకోర్టు బెంచ్‌ను తరలించేందుకు అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని కర్నూలు బార్ అసోసియేషన్ సభ్యులు రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావుకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలువురు న్యాయవాదులు అమరావతికి వెళ్లి హైకోర్టు న్యాయమూర్తిని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతం వారు అమరావతికి రావడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారని, హైకోర్టు తరలింపుతో వారి సమస్యలు తొలగిపోతాయని తెలిపారు. హైకోర్టు బెంచ్ విషయంలో త్వరితగతిన ఏర్పాటు చేసేలా న్యాయమూర్తి చొరవ చూపాలని వారు కోరారు. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తికి ఒక విజ్ఞాపన పత్రాన్ని అందజేసినట్లు న్యాయవాదులు తెలిపారు. హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన వారిలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి బీఎస్ రవికాంత్ ప్రసాద్, స్టీరింగ్ కమిటీ కన్వీనర్ కె. కపిలేశ్వరయ్య, సీనియర్ న్యాయవాదులు రామసుబ్బారెడ్డి, నాగేంద్రనాథ్, రమణారెడ్డి, వీవీ కృష్ణం రాజు, దాసెట్టి శ్రీనివాసులు, పి. శివసుదర్శన్ ఉన్నారు.

హౌసింగ్ పీడీగా అజయ్‌కుమార్



కర్నూలు, రాజ్‌విహార్ సర్కిల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): జిల్లా గృహ నిర్మాణశాఖ నూతన పీడీగా టి.అజయ్‌కుమార్ నియమితుల య్యారు. ఈ మేరకు కలెక్టర్ పి.రంజిత్ బాషా ఉత్తర్వులు జారీ చేశారు. హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ -04 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పని చేస్తున్న ఈయన మంగళవారం ఆయన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న చిరంజీవి ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌గా బదిలీ కావటంతో ఆయన స్థానంలో అజయ్‌కుమార్ పీడీగా అదనపు బాధ్యతలు చేపట్టడం గమనార్హం.

'వేరుశనగను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి'

కర్నూలు న్యూసిటీ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వేరుశనగను ప్రభుత్వమే ఆయిల్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే.జగన్నాథం మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మార్కెట్‌లో వేరుశనగ ధరలు పూర్తిగా పతనమైందని అన్నారు. పంట రాకముందు ఒక క్వింటం రూ.8 వేలు ఉందని, రైతుల నుంచి పంట మార్కెట్లోకి వచ్చాక హఠాత్తుగా రూ.4,500 పడిపోయిందన్నారు. ఆరుగాలం కష్టించి పంట పండించిన గిట్టుబాటు ధర రావడం లేదన్నారు. తక్షణమే రూ.10 వేల ప్రకారం ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

క్రీడల్లోనూ రాణించాలి

కర్నూలు స్పోర్ట్స్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని క్రీడాయ్ కార్యదర్శి బ్రిజేష్ సింగ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ అవుట్‌డోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న సౌత్‌జోన్ వుడ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు ముఖ్యఅతిథిగా బ్రిజేష్ సింగ్ హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకి కొత్త క్రీడను పరిచయం చేసి అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్న కార్యదర్శి ప్రభాకర్‌ను అభినందించారు. వుడ్‌బాల్ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ రెహిమాన్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, తమిళనాడు వుడ్‌బాల్ కార్యదర్శి ప్రశాంత్, తెలంగాణ కార్యదర్శి ఆదర్ష్, యోగాసన అధ్యక్షుడు శివరాజు పాల్గొన్నారు.

'లేబర్ కోడ్ అమలును విరమించుకోవాలి'

కర్నూలు న్యూసిటీ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా లేబర్ కోడ్‌లను అమలు చేయాలనే ఆలోచనను బీజేపీ ప్రభుత్వం విరమించుకోవాలని ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా కార్యదర్శులు ఎస్.మునెప్ప, ఎండీ అంజిబాబులు డిమాండ్ చేశారు. మంగళవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ బీజేపీ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 5న పార్లమెంటులో పెట్టిన కార్మిక వ్యతిరేక బడ్జెట్ కాపీలను దహనం చేయాలని కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో కార్మికులు, ఉద్యోగులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, యూటీయూసీ జిల్లా కార్యదర్శి తిరుపాలు, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి రాజు పాల్గొన్నారు.

పొదుపు గ్రూపు సభ్యురాలికి చేయూత



సరస్వతికి ప్లేట్లు అందజేస్తున్న ఆర్పీలు

కర్నూలు న్యూసిటీ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): శాంతిగ్రూపు సభ్యురాలు సరస్వతి గుడిసె కాలిపోయి నిరాశ్రయులు కావడంతో మెప్మా ఆర్పీ ఉద్యోగుల సంఘం చేయూతనిచ్చింది. మంగళవారం వీకర్‌సెక్షన్ కాలనీలో సంఘం నగర కార్యదర్శి ఎస్.షబానా సరస్వతికి వంట పాత్రలు, ప్లేట్లు, ఆర్పీ సుజాత 50 కిలోల బియ్యం, ఎస్‌ఎల్‌ఎఫ్‌లు సిరి, ఉజ్వలలు రూ.2 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఈసందర్భంగా జిల్లా కార్యదర్శి ఉమాదేవి మాట్లాడుతూ సరస్వతికి చెందిన గుడిసె పూర్తిగా కాలిపోయిందన్నారు. దాతలు ఎవ్వరైనా సహకరించి ఆమెకు గుడిసె నిర్మించి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్పీలు నాగమణి, వరలక్ష్మి, వి.రుద్రమ్మ పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

సి.బెళగల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని అంబేడ్కర్ గురుకుల పాఠశాల జిల్లా కో-ఆర్డినేటర్ శ్రీదేవి హెచ్చరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల భోజన విరామ సమయంలో వాచ్‌మన్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ బలరాముడు, అడిషనల్ ప్రిన్సిపాల్ విజేయుడు, ఉన్నారు.

అక్షరం అండగా సమస్యలు వెలుగులోకి

ఆంధ్రజ్యోతి చేపట్టిన అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా.. అనే కార్యక్రమం మంగళవారం 29వ వార్డులోని ఉద్యోగనగర్ శారదా పాఠశాలలో నిర్వహించింది. క్షేత్రస్థాయి సమస్యలను ఈ వినూత్న కార్యక్రమం వెలుగులోకి తీసుకొచ్చింది. అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరైన ఈ సమావేశంలో కాలనీల్లోని సమస్యలు ప్రజల మాటల్లోనే...



'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమానికి హాజరవుతున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత

వీధి కుక్కల ఆగడాలను అరికట్టాలి



కాలనీల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. విచ్చలవిడిగా పిల్లలపై పడి కరుస్తున్నాయి. అలాగే పాముల బెడద కూడా ఎక్కువగా ఉంది. వీటి నివారణకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలి. అలాగే అన్ని వీధుల్లో ఇళ్ల వద్దకు వచ్చి చెత్తను సేకరించే ఏర్పాటు చేయాలి.

- అహ్మద్, కాలనీవాసి

దొంగతనాలు అరికట్టాలి



29వ వార్డు పరిధిలో రాత్రివేళల్లో దొంగతనాలు జరుగుతున్నాయి. ఈ కాలనీలో ప్రధాన కూడలిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. రాత్రివేళలో పోలీస్ పెట్రోలింగ్‌ను మరింత విస్తృతంగా చేపట్టాలి. సివిల్ సప్లయ్ సరఫరా ద్వారా రేషన్ వాహనాలను కాలనీలోని ఇళ్ల వద్దకు వచ్చేలా చూడాలి.

- నాగరాజు,కాలనీవాసి

అప్రోచ్ రోడ్డు నిర్మించాలి



జాతీయ రహదారి నుంచి కాలనీ వరకు అప్రోచ్ రోడ్డు నిర్మించాలి. కాలనీ దిగువకు ఉండటంతో వర్షాకాలంలో పైనుంచి వచ్చిన నీరంతా కాలనీలోకి వస్తున్నది. కల్వర్టులు నిర్మించి వర్షపు నీటిని ఆపాలి.

- గోవిందరాజులు

కుక్కల బెడద నివారించాలి



జిల్లా పరిషత్ పాఠశాల వద్ద పెద్ద సంఖ్యలో కుక్కలు సంచరిస్తున్నాయి. చిన్నారులు పాఠశాలకు వెళ్లే సమయంలో వారిపై విరుచుకుపడుతున్నాయి. తక్షణమే అధికారులు స్పందించి పాఠశాల వద్ద కుక్కల బెడదను నివారించాలి

- సూరెన్న

సిమెంటు రోడ్డు వేయాలి..



రామదాసు నగర్‌లో సిమెంటు రోడ్డు వేయాలి. కాలనీలో పిచ్చి మొక్కలు పెరిగి పాములు సంచరిస్తున్నాయి. తక్షణమే పిచ్చిమొక్కలు తొలగించాలి. అంతే కాకుండా కాలనీలో కేవలం 200 మీటర్ల రోడ్డు మాత్రమే వేసారు. మిగిలిన కూడ వేయాలి.

- రామక్రిష్ణుడు

చాలా సమస్యలు ఉన్నాయి



వార్డులో అన్నీ సమస్యలే. కాలువలు లేకపోవడం, వీధి దీపాలు వెలగకపోవడం వంటి సమస్యలు ఉన్నాయి. నీటి సమస్య ఉంది. పైప్‌లైన్ నిర్మించాలి. అధికారులు స్పందించి సమస్యలు త్వరగా పరిష్కరించాలి.

- గిరిజ, కాలనీ వాసి

శ్మశానం ఏర్పాటు చేయాలి



కాలనీలో జనాభా పెరుగుతున్నది. కాలనీకి శ్మశానం లేదు. ఏర్పాటు చేయాలి. కల్లూరు దగ్గర ఉన్న శ్మశానం సరిపోవడం లేదు. కాలనీ నుంచి హంద్రీ నది మీద ఒక వంతెన నిర్మిస్తే పందిపాడు వెళ్లేందుకు సులువుగా ఉంటుంది.

- లింగన్న, కాలనీ వాసి

వాసునగర్‌లో పార్కు అన్యాక్రాంతం



వాసునగర్‌లోని సర్వే నెంబర్లు 535,536లో సుమారు 74 సెంట్ల పార్కు స్థలం అన్యాక్రాంతమైంది. కాలనీలో వీధి లైట్లు ఏర్పాటు చేయడంతో పాటు పిచ్చిమొక్కలను తొలగించాలి. పాముల బెడద నుంచి రక్షించాలి

- రామఫణిశర్మ, కాలనీ వాసి

అంగన్‌వాడీ సెంటర్ ఏర్పాటు చేయాలి



ఉద్యోగ నగర్‌లో అంగన్‌వాడీ సెంటర్ ఏర్పాటు చేయాలి. ఇక్కడి నుంచి శరీన్‌నగర్ అంగన్‌వాడీ సెంటర్‌కు పోతే వాళ్లు రానీయడం లేదు. తక్షణమే చిన్నారులు, బాలింతలు, గర్భిణుల కోసం అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలి.

- రమణమ్మ, కాలనీ వాసి

పబ్లిక్ పార్కు ఏర్పాటు చేయాలి



కాలనీలో పబ్లిక్ పార్కు ఏర్పాటు చేయాలి. వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి సమయాల్లో బయటికి రావాలంటే భయంగా ఉంది. పార్కులు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలి.

- ఎస్.చంద్రశేఖర్, కాలనీ వాసి

అసంపూర్తిగా రోడ్డు నిర్మాణం



ఈ కాలనీలో 21 సంవత్సరాల నుంచి ఉంటున్నాం. కాలనీలో కాలువలు లేవు. సిమెంట్ రోడ్డు అసంపూర్తిగా ఉండిపోయింది. ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలి.

- సరస్వతి, కాలనీ వాసి





మాట్లాడుతున్న కార్పొరేషన్ కమిషనర్

డ్రైనేజీ సమస్య పరిష్కరించాలి

కర్నూలు, రాజ్‌విహార్ సర్కిల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 29 వార్డులోని క్రిష్ణప్రియ నగర్‌లో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని, పార్కు స్థలం అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులను పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత ఆదేశించారు. మంగళవారం ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే గౌరుచరిత క్రిష్ణప్రియ నగర్‌లో క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. స్థానికులు మహేందర్‌రెడ్డి, జాకబ్ షిమ్మీ కాలనీ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. క్రిష్ణప్రియ నగర్ లే అవుట్‌లో 71 సెంట్ల ఖాళీ స్థలంలో నిరుపయోగంగా ఉందని, దానిని ఉద్యానవనంగా అభివృద్ధి చేయాలని కోరారు. అదేవిధంగా అస్తవ్యస్తమైన మురుగునీటి వ్యవస్థ వల్ల కాలువల్లో మురుగు వెలుపలికి వచ్చి ఖాళీ స్థలాల్లో నిల్వ ఉండి, దోమలకు నివాసంగా మారుతోందన్నారు. వీధి దీపాలు సక్రమంగా వెలగడంలేదని, పాముల సంచారం అధికంగా ఉందని ఎమ్మెల్యేకు ప్రజలు విన్నవించారు.

బాల్య వివాహాలపై ప్రత్యేక దృష్టి: డీఎంహెచ్‌వో



వైద్యాధికారులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

కర్నూలు హస్పిటల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బాల్య వివాహాలపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం డీఎం హెచ్‌వో కల్లూరు పీహెచ్‌సీని తనిఖీ చేశారు. అనంతరం ఎంఎ ల్‌హెచ్‌పీ, ఆరోగ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. బాల్య వివాహాలు జరగకుండా అమ్మాయిలకు 18 సంవత్సరాలు, అబ్బాయిలకు 21 సంవత్సరాలు పూర్తయిన తర్వాత వివాహాలు జరిపించా లన్నారు. జాతీయ ఆరోగ్యకార్యక్రమాల ప్రగతి వంద శాతం తక్కువగా కాకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. మూడేళ్ల తాత్కాలికంగా కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి నూకరాజు, పీహెచ్‌సీ వైద్యాధికారి మోతీలాల్ నాయక్, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌వో పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలను పాటించాలి

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియామాలు పాటించాలని ఆర్‌టీవో భరత్ చవాన్ అన్నారు. మంగళవారం స్థానిక కేంద్రీయ విద్యాలయంలో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల కార్యక్రమాన్ని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎస్.శాంతకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఆర్టీవో భరత్ చవాన్ పర్యవేక్షణలో రోడ్డు భద్రత సదస్సు కొనసాగింది. ఈ సందర్భంగా మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్లు ఎన్.నాగరాజు నాయక్, అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్స్‌పెక్టర్ బాబు కిషోర్ మాట్లాడుతూ విద్యార్థులకు రహదారి భద్రతలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్.గణేష్‌బాబు, హెడ్ కానిస్టేబుళ్లు చలపతి, వి.విజయభాస్కర్, హోంగార్డు, కేంద్రీయ విద్యాలయం సిబ్బంది, విద్యార్థులు, స్కూల్ బస్సు డ్రైవర్, క్లీనర్లు పాల్గొన్నారు.

'కాలేజీ గుర్తింపును రద్దు చేయాలి'

కర్నూలు హస్పిటల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ నర్సింగ్ కాలేజీ గుర్తింపును రద్దు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, నగేష్ డిమాండ్ చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ నగరంలో ఓ నర్సింగ్ కాలేజీ యజమాన్యం విద్యార్థిని కళాశాలకు రానీవ్వకుండా బయటకు గెంటివేయడం దారుణమన్నారు. నగరంలోని నర్సింగ్ కాలేజీలు ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నిర్దేశించిన ఫీజుల కంటే అధికంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై కలెక్టర్, డీఎంహెచ్‌వో విచారణ చేసి నర్సింగ్ కాలేజీ గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

'అరెకటిక కులాన్ని ఎస్సీ జాబితాలో చేర్చాలి'

కర్నూలు అర్బన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): అరెకటిక కులాన్ని ఎస్సీ జాబితాలో చేర్చాలని టీడీపీ నాయకుడు ఎన్‌డీ కృష్ణాజీరావు డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని అరెకటిక కుల సమితి సమావేశం భవనంలో కులపెద్దలతో సమావేశం జరిగింది. కృష్ణాజీరావు మాట్లాడుతూ ఓటు బ్యాంక్ రాజకీయాలకు మాత్రమే తమ కులాన్ని రాజకీయ పార్టీలు వాడుకుంటూ వచ్చాయన్నారు. కార్యక్రమంలో నాయకులు కుమార్, వెంకటేష్, రాంబాబు పాల్గొన్నారు.

ముగిసిన దరఖాస్తుల స్వీకరణ

కోడుమూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ ఖాళీల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ నేటితో ముగిసిందని సీడీపీవో వరలక్ష్మి తెలిపారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం ఆమె మాట్లాడుతూ కోడుమూరు నియోజకవర్గ పరిధిలోని ఆయా పోస్టుల కోసం 62 మంది దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. సి.బెళగల్ మండలంలోని గొల్లలదొడ్డి1 అంగన్ వాడీ వర్కర్ కోసం ముగ్గురు దరఖాస్తు చేసుకున్నారన్నారు. సంగాల-2 అంగన్‌వాడీ వర్కర్ కోసం ఒక్కరు కూడా దరఖాస్తు చేసుకోలేదన్నారు. కోడుమూరు మండలంలోని క్రిష్ణాపురం1 అంగన్‌వాడీ వర్కర్ కోసం 4 దరఖాస్తులు వచ్చాయన్నారు. కోడు మూరు 9 అంగన్‌వాడీ సెంటర్‌లోని హెల్పర్ కోసం అత్యధికంగా 19 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఆమె చెప్పారు. అలాగే గార్గేయపురం 2 అంగన్‌వాడీ హెల్పర్ కోసం 14 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు.

నిడ్జూరు 3, కొత్తపల్లి, నూతనపల్లి, యనగండ్ల గ్రామంలోని అంగన్‌వాడీ హెల్పర్స్ కోసం ఒకటి చొప్పున దరఖాస్తులు వచ్చాయన్నారు. జి.సింగవరం2 హెల్పర్‌కు 2 దరఖాస్తులు చొప్పున, గుండ్రేవుల3 హెల్పర్ కోసం 3 దరఖాస్తులు, గుండ్రే వుల1, మారందొడ్డి 2 హెల్పర్స్ కోసం 4 చొప్పున దరఖాస్తులు, కొత్తకోట 4 హెల్పర్ కోసం ఐదుగురు దరఖాస్తు చేసుకున్నారన్నారు. మునగాల, రేమట, పసుపుల, వెంకటగిరి, తిమ్మందొడ్డి హెల్పర్స్ కోసం ఒక్కరు కూడా దరఖాస్తు చేసుకోలేదన్నారు.

పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి: సీపీఐ

కర్నూలు న్యూసిటీ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సీపీఐ నగర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. రాష్ట్రసమితి పిలుపులో భాగంగా మంగళవారం ముజఫర్ నగర్ ఆటో స్టాండ్ నుంచి సచివాలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. అనంతరం సచివాలయ వీఆర్‌ఓకు వినతిపత్రం అందజేశారు. మాజీ కార్పొరేటర్ గిడ్డమ్మ, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి శ్రావణిరెడ్డి, బీసన్న, తదితరులు పాల్గొన్నారు.

కళాశాల యజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ప్రాణాలతో చెలగాట మాడుతున్న కళాశాల యజమాన్యంపై చర్యలు తీసుకుని, ఆ కళాశాల గుర్తింపును రద్దు చేయాలని ఐద్వా, ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళ వారం స్థానిక ఆర్‌ఐవో కార్యాలయంలో ఆర్‌ఐవో గురువయ్యశెట్టిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఐద్వా, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అరుణ, అలివేలమ్మ, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న మాట్లాడుతూ నగరంలో ఓ కళాశాలలో రెండు రోజుల క్రితం ఓ విద్యార్థిని కత్తితో పొడిచి జుట్టు కత్తిరించి క్షుద్రపూజలు చేసి, విద్యార్థిని ఫొటోపై నిన్ను చంపుతానని చీటిపై రాసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఐద్వా, ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేస్తాం

గూడూరు జనవరి 28(ఆంధ్రజ్యోతి): గూడూరు జడ్పీ(బాలురు) పాఠశాల ఆవరణలోని క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేస్తామని నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ కురుకుంద రామాంజనేయులు అన్నారు. మంగళవారం పాఠ శాల ఆవరణలో క్రీడాకారులు ఆడుకోనేందుకు అవసరమైన సదుపాయలను సమకూర్చారు. టీడీపీ నాయకులు రేమట వెంకటేష్, సృజన్, పౌలు, కౌన్సిలర్లు రేమట సురేష్, కలాం బాషా, విద్యాకమిటీ చైర్మన్ సింగనగేరి కర్ణ, పాఠశాల హెచ్‌ఎం పాల్గొన్నారు.

బెల్టుషాపులపై ఎక్సైజ్ అధికారుల దాడులు

కర్నూలు అర్బన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కర్నూలు మండలంలో బెల్టుషాపులపై ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. మంగళవారం మునగాలపాడులో వెంకటేశ్వరమ్మ వద్ద 15, మహేశ్వరమ్మ వద్ద 18, ఉల్చాల గ్రామంలో వడ్డే సుంకులమ్మ వద్ద 30, ఈ తాండ్రపాడు గ్రామంలో శ్రీనివాసులు వద్ద 25, గొల్ల రాంపుల్లయ్య వద్ద 24 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎక్సైజ్ సీఐ చంద్రహాస్ తెలిపారు. డీటీఎఫ్ ఇన్స్‌పెక్టర్ రాజేంద్ర ప్రసాద్, ఎస్ఐ రెహనా బేగం, ఇంద్ర కిరణ్ తేజ పాల్గొన్నారు.

పొగాకును కొనుగోలు చేయండి

ఓర్వకల్లు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పొగాకు పంటను కొనుగోలు చేయాలని రైతు వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని నన్నూరు గ్రామంలో బొజ్జన్న, స్వాములు, శ్రీనివాసులు పొగాకు పంటలను ఆయన పరిశీలించారు.

31న వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం



మాట్లాడుతున్న నంద్యాల నాగేంద్ర

కర్నూలు అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల ఇలవేల్పు వాసవి కన్యాకాపరమేశ్వరీ అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఈనెల 31న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నంద్యాల నాగేంద్ర తెలిపారు. మంగళవారం అమరావతిలో సీఎం చంద్రబాబు కలిసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఎన్నికల హామీ మేరకు మాఘ శుద్ధ విదియ తిథి నాడు ఆత్మర్పణ దినోత్సవాన్ని నిర్వహించాలని, జీవో నెంబర్ 181ని ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. ఈసందర్భంగా సీఎం చంద్రబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఈకేవైసీ చేయించుకోండి



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయాధికారులు

ఓర్వకల్లు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి సుధాకర్ సూచించారు. మంగళవారం మండలంలోని పూడిచెర్ల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. శనగ పంట సాగును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీలో వేసిన ప్రతి రైతు తమ పంటలను ఈకేవైసీ తప్పకుండా చేయించుకోవాలన్నారు. ఏఈవో భాస్కర్, రైతులు పుల్లారెడ్డి, ప్రకాశం, తిరుపాలు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

కోడుమూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల పట్ల పిల్లలు, యువత అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ డాక్టర్ నాగరాజు అన్నారు. స్థానిక జీవీఆర్ జిల్లా బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం మాదక ద్రవ్యాలతో కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీడి, సిగరేటు, గుట్కా, ఖైని, గంజాయి, హెరాయిన్ వీటి వలన క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. డాక్టర్ మదన్ శేఖర్, ఎంఈవో తైమూరు బాషా, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

నిజమైన అభివృద్ధి కావాలి: సీపీఎం

కర్నూలు న్యూసిటీ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఎండమావుల అభివృద్ధి కాదని, నిజమైన అభివృద్ధి కావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు కె.ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కేకే భవన్‌లో జరిగిన సీపీఎం విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఎండమావులను చూపించి అదిగో అక్కడ నీళ్లు ఉన్నాయనే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. గోదావరి జలాలను రూ.80వేల కోట్లు ఖర్చుపెట్టి రాయలసీమను సస్యశ్యామలం చేస్తామని చెప్పడం ఎండమావుల్లాగే ఉందని అన్నారు.

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

కర్నూలు హస్పిటల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని జిల్లా అసంక్రమిత వ్యాధుల నివారణ అధికారి డాక్టర్ శైలేష్ కుమార్ అన్నారు. మంగళవారం ఈ.తాండ్రపాడు పీహెచ్‌సీ పరిధిలోని పంచలింగాలలో ఏపీ గురు కుల పాఠశాలలో ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నివారణ, నిర్మూలన, మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు జరిగింది.

జాతీయ స్థాయి పోటీలకు రవీంద్ర విద్యార్థిని

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): అబ్బాస్‌నగర్‌లోని రవీంద్ర పాఠశాలలో విద్యార్థులు రాష్ట్రస్థాయి బాలోత్సవ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. డిజిటల్ కొలాజ్ విభాగంలో ఎంకే ఆదిత్య అనే విద్యార్థి రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రంగోలిలో అక్షరశ్రీ బృందం ద్వితీయ స్థానం సాధించింది. రోల్‌ప్లే పోటీలో హపీపా బృందం ప్రోత్సాహక బహుమతి సాధించింది. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో రవీంద్ర విద్యాసంస్థల వ్యవస్థాపకుడు జి.పుల్లయ్య మాట్లాడారు. కార్యక్రమంలో అకడమిక్ అడ్వైజర్ మమత, వైస్ చైర్మన్ వంశీధర్, పాఠశాల సమన్వయకర్తలు పాల్గొన్నారు.



విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేస్తున్న పాఠశాల నిర్వాహకులు

అసాంఘిక భవనం

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా ఎస్సీ హాస్టల్ 2
- కళాశాల విద్యార్థులను ఇక్కడికి మారుస్తామని హంగామా
- అనంతరం అధికారుల మీనమేషాలు



హాస్టల్ భవనం, ఇన్‌సెట్‌లో తలుపులు లేని బాత్రూం

ఆదోని అగ్రికల్చర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎమ్మిగనూరు సర్కిల్ సమీపంలోని సాంఘిక సంక్షేమ శాఖ ఎస్సీ హాస్టల్ నెం.2 (కరెప్ప) భవనం నిరుప యోగంగా మారింది. విద్యార్థులు తక్కువగా ఉన్నారన్న కారణంతో ఇక్కడి హాస్టల్‌ను మూసేశారు. అనంతరం ఈ భవనంలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, న్యాక్ శిక్షణ కేంద్రంగా మార్చారు. అనంతరం దాన్ని కూడా ఆర్ట్స్ కళాశాల సమీపంలోని మరో భవనంలోకి మార్చడంతో ఈ భవనం నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకుంటోంది.

శివార్లలోని హాస్టల్‌ను మారుస్తామని హంగామా

ఇక్కడి న్యాక్ కేంద్రాన్ని వెంటనే తరలించాలని సాంఘిక సంక్షేమ అధికారులు ఒత్తిడి తెచ్చిమరీ మార్పించారు. పట్టణ శివార్లలోని హాస్టల్ నెం.3ని ఇక్కడికి మారు స్తామని హంగామా చేశారు. అయితే అనంతరం ఏమైందో కాని పట్టించుకోవడం మానేశారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా..

భవనం ఖాళీగా ఉండటంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. చీకటిపడితే చాలు మందుబాబులు ఇక్కడ తిష్ట వేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సెక్యూరిటీ లేకపోవడతో అసాంఘిక కార్యకలా పాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆకతాయిలు భవనంలోని సామగ్రిని ఎత్తుకెళుతున్నారు. ఇప్పటికే బాత్రూం తలుపులను ఎత్తుకెళ్లారు. ఇలాగా వదిలేస్తే భవనంలోని సామగ్రి మొత్తం దొంగల పాలు అవుతుందని అధికారులు స్పందించాలని విద్యార్థులు కోరుతున్నారు.

రూ.13లక్షల మరమ్మతులు వృథా..

నాలుగేళ్లుగా వృథాగా ఉన్న హాస్టల్ భవనాన్ని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్), ఏపీ నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారులు తీసుకున్నారు. ఈ భవనంలో నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాటు చేశారు. దాదాపు రూ.13లక్షలు ఖర్చు చేసి భవనానికి మరమ్మతులు కూడా చేయించారు. తమ విద్యార్థులు ఇక్కడికి వస్తారని న్యాక్ వారిని బయటకు పంపిన అధికారులు అనంతరం మిన్నకుండిపోవడంపై విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాగే వదిలేస్తే భవనం శిథిలావస్థకు చేరుకునే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కళాశాల విద్యార్థులను ఇక్కడికి మార్చాలి



పట్టణ శివార్లలలోని ఎస్సీ కళాశాల హాస్టల్ శిథిలావస్థకు చేరింది. అక్కడి విద్యార్థులను ఈ భవనంలోకి మార్చాలి. ఇలాగే వదిలేస్తే భవనం శిథిలావస్థకే చేరే ప్రమాదం ఉంది.

- లింగప్ప, ఏఐఎస్ఎఫ్ నాయకుడు, ఆదోని

త్వరలోనే మారుస్తాం



హాస్టల్ భవనంలో ఇంకా మరమ్మతులు చేయించాలి. ఇందుకు ప్రభుత్వం రూ.39 లక్షలు మంజూరు చేసింది. మరమ్మతులు చేసిన వెంటనే కళాశాల హాస్టల్ విద్యార్థులను ఇక్కడికి త్వరలోనే మారుస్తాం. ఇంజనీర్‌ను కలిసి పనులు చేపట్టాలని కోరతాం

- బాబు, ఎస్‌డబ్ల్యూవో ఆదోని

పారా లీగల్ వలంటీర్ల నియామకానికి దరఖాస్తు చేసుకోండి

ఆదోని. జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పారా లీగల్ వలంటీర్ల నియామకానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా న్యాయ సేనాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.కుబర్థి మంగళ వారం ఓ ప్రకటనలో కోరారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ, మండల లీగల్ సర్వీస్ కమిటీల్లో పని చేయడానికి దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. ఉమ్మడి జిల్లా వాసి అయి ఉండాలని, పదో తరగతి ఉండాలని సూచించారు. ఉపాధ్యాయులు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులు కూడా అర్హులన్నారు. దరఖాస్తును జిల్లా, మండల లీగల్ సర్వీసెస్ కార్యాలయాల్లో పొందవచ్చని, ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం లోపు దరఖాస్తులను అందచేయాలని సూచించారు.

పశువైద్య శిబిరాన్ని వినియోగించుకోండి


తుగ్గలి: బొందిమడుగులలో చికిత్స చేస్తున్న పశువైద్యుడు

మద్దికెర, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులు పశువైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని సర్పంచ్ బురుజుల విజయుడు, పశువైద్యాధికారి కృష్ణ నాయక్, తెలుగు యువత అధ్యక్షుడు ఈడిగ చంద్రశేఖర్‌గౌడ్ కోరారు. మంగళవారం ఎం.అగ్రహారం గ్రామంలో పశువైద్యశిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం పశువులకు చికిత్స చేసి, వ్యాధులు, నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు.

పశువులకు టీకాలు తప్పనిసరి

తుగ్గలి: పశువులు, మూగజీవాలకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని ముక్కెళ్ల పశువైద్యాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం బొంది మడుగుల గ్రామంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువులను పరీక్షించి మందులు అందజేశారు. పశువులు ఆహారం తీసుకోకుంటే వెంటనే వైద్యపరీక్షలు చేయించాలన్నారు. సలహాదారుడు ప్రతాప్‌యాదవ్, దాదా ఖలందర్‌బాషా, రవితేజ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కందుల విక్రయానికి రిజిస్ట్రేషన్ చేసుకోండి

వెల్దుర్తి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కందులవిక్రయానికి రైతులు రైతుసేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏవో అక్బర్‌బాషా కోరారు. మండలంలో రెండు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేశామని, మద్దతు ధర రూ.7,550ల కొనుగోలు చేస్తామన్నారు.

ఉపాధి బిల్లులు చెల్లించాలి


కూలీలతో మాట్లాడుతున్న లింగన్న

ఆదోని రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ ఉపాధి బిలుల్లను చెల్లించాలని కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లింగన్న కోరారు. మంగళవారం కార్మిక సంఘం ఆధ్వర్యంలో దొడ్డన గేరి, మాంత్రికి, పెసలబండ గ్రామాల్లో కూలీలతో సమావేశమ య్యారు. పనులు చేసినా 5 వారాలుగా కూలి ఇవ్వడం లేదన్నారు.

భూముల ధరల పెంపును ఉపసంహరించుకోవాలి


ప్రకాష్ జైన్

ఆదోని టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భూముల విలువ పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్ డిమాండ్ చేశారు. రిజిస్ట్రేషన్ విలువలను ఫిబ్రవరి1 నుంచి పెంచుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించడం సరికాదన్నారు. వైసీపీ ప్రభుత్వం కూడా భూముల విలువలను వందశాతం పెంచిం దని, మళ్లీ పెంచితే ప్రజలపై భారం పడుతుందన్నారు.

బోగస్ మస్టర్లు వేస్తే చర్యలు

తుగ్గలి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పనులకు రాకున్నా బోగస్ మస్టర్లు వేస్తే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో విశ్వమోహన్ హెచ్చరించారు. మంగళవారం జొన్నగిరిలో ఉపాధి పనులను పరిశీలించి మస్టర్లను తనిఖీ చేశారు. పనులకు వచ్చిన కూలీల పేర్లు మాత్రమే మస్టర్లలో ఉండాలన్నారు ఏపీవో హేమసుందర్, టీఏ పరీదప్ప, రామకృష్ణ, రామాంజనేయులు, ఎఫ్ఏలు సీనియర్‌మేట్లు ఆంజనేయులు, జయచంద్ర ఉన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ, అభివృద్ధికి విరాళం


విరాళం ఇస్తున్న ఎమ్మెల్యేలు విరుపాక్షి, జయరాం

ఆలూరు జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కురుకుంద గ్రామం లక్ష్మి నరసింహ ఈరన్న విగ్రహాల ప్రతిష్ఠకు ఎమ్మెల్యే విరుపాక్షి రూ.25వేల విరాళం ఇచ్చారు. కమిటీ సభ్యులు, సర్పంచ్ దేవి రెడ్డి ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయానికి గుమ్మనూరు రూ.20వేల విరాళం

అరికెర గ్రామం మాళమల్లేశ్వర ఆలయం అభివృద్ధికి మాజీ మంత్రి, గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం రూ.20వేలు విరాళం అందజేశారు. గుమ్మనూరు ఈశ్వర్ పాల్గొన్నారు.

రాష్ట్ర కబడ్డీ పోటీల్లో ప్రతిభ


క్రీడాకారులతో కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి శుభకర్

ఆదోని అగ్రికల్చర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఈనెల 25 నుంచి విశాఖ జిల్లా అనకాపల్లిలో జరిగిన రాష్ట్రకబడ్డీ పోటీల్లో ఆదోని క్రీడాకారులు ప్రతిభ చాటినట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి శుభకర్, సహాయ కార్యదర్శి అమర్ ప్రకాష్ తెలిపారు. రాజు, అవినాష్, వాల్మీకి జంపన్న, సుమంగళి, సంధ్య ప్రాతినిధ్యం వహించి, తృతీయ స్థానంలో నిలిచారని అభినందనలు తెలిపారు.

ట్రాఫిక్ నియంత్రణకు సహకరిస్తాం: కమిషనర్


డీఎస్పీ హేమలతతో చర్చిస్తున్న కమిషనర్ కృష్ణ

ఆదోని టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసు శాఖకు సహకరిస్తామని మున్సిపల్ కమి షనర్ కృష్ణ తెలిపారు. మంగళవారం కమిషనర్ ఛాంబర్‌లో ట్రాఫిక్ నియంత్రణ చర్యలపై డీఎస్పీ హేమలత, అధికారులతో సమావేశం నిర్వహించారు. పట్టణంలో ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలతో పాటు అవసరమైనా చోట స్పీడ్ బ్రేకర్లు వీధిదీపాలు కూడా ఏరాటుఉ చేయాలని కూడళ్లలో పబ్లిక్ అడ్రస్ సిస్టం అమర్చాలని డీఎస్పీ సూచించారు. పుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురవుతున్నాయని, ఆర్అండ్‌బీ అధికా రులతో మాట్లాడి రహదారికి ఇరు వైపులా కాలువల వరకు రోడ్డు నిర్మిస్తే ప్రయోజనం ఉంటుందని అసిస్టెంట్ సిటీ ప్లానర్ కృష్ణ సింగ్ సూచించారు. ఎంఈ ఇంతియాజ్ అలీ, డీఈ గోపినాథ్, ట్రాఫిక్ సీఐ ఘంటా సుబ్బారావు పాల్గొన్నారు.

భూ సమస్యలపై చర్యలు తీసుకోండి:ఆర్డీవో

హాలహర్వి , జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులో వచ్చిన భూ సమస్యలపై వెంట నే చర్యలు తీసుకోవాలని ఆర్డీవో భరత్ నాయక్ ఆదేశించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. భూ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో రైతులు న్యాయస్థానం చుట్టూ తిరుగుతున్నారన్నారు. క్షేత్రస్థాయిలో పరిష్కరిస్తే ఇబ్బందులు ఉండవని సూచించారు. తహసీల్దార్ నజ్మబాను. లక్ష్మీ, సర్వేయర్ భార్గవి, వీఆర్వోలు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో

ఏఐఎస్ఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

పత్తికొండ టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళ వారం ఏఐఎస్ఎఫ్ క్యాలెండర్‌ను సీఐ జయన్న, తహసీల్దార్ రమేష్ ఆవిష్కరించారు. మండల కార్యదర్శి శివ మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిరక్షణకై ఏఐఎస్ఎఫ్ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. నాయకులు రమేష్, అహ్మద్, రవి, చరణ్ పాల్గొన్నారు.


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐ జయన్న

దోమల నివారణ చర్యలు తీసుకోండి

వెల్దుర్తి / టౌన్ జనవరి 28(ఆంధ్రజ్యోతి): పాఠశాల పరిసర ప్రాంతాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా నివారణ చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి నూకరాజు సూచించారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను పరిశీలించారు. విద్యార్థులకు వైద్యపరీక్షలు చేయించాలని, ఆరోగ్యసూత్రాలను తెలియజేయాలన్నారు. ప్రిన్సిపాల్ లక్ష్మి ప్రసూన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వాలకు రుణపడి ఉంటాం

వెల్దుర్తి టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ ఇచ్చినందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రుణపడి ఉంటామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు రెడ్డిపోగు భాస్కర్ అన్నారు. పట్టణంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు దేవరాజు, నాయకంటి గిడ్డయ్య మాదిగ, మాజీ జడ్పీటీసీ ఐజయ్య, మాశపోగు బజారు, జగ్గుల బజారు, మోషా, సూర్యచంద్ర పాల్గొన్నారు.

ఆసుపత్రికి బెడ్ వితరణ

వెల్దుర్తి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి ఆర్టీసీ డ్రైవర్ శ్రీనివాసులు, ఎల్లకృష్ణ తమ తల్లిదండ్రులు పెద్దకృష్ణ, పుల్లమ్మ జ్ఞాపకార్థం మంచాన్ని అందజేశారు. వీరిని సూపరింటెంట్ డాక్టర్ బాలచంద్రారెడ్డి అభినందించారు. నందీశ్ ట్రస్టు అధ్యక్షుడు శివప్రసాద్ పాల్గొన్నారు.

'పది'లో ప్రతిభ చూపాలి

మద్దికెర, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ప్రతిభ చూపాలని ఎంఈవో రంగస్వామి సూచించారు. మంగళవారం కస్తూర్బా బాలికల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థుల్లో పోటీతత్వం ఉండాలని, ప్రతిభ చూపినవారికి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని హామీ ఇచ్చారు. ప్రిన్సిపాల్ జ్యోతిరెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

మాట నిలబెట్టుకోవాలి

ఆదోని రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ప్రజలకిచ్చిన మాటను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని సీపీఐ పట్టణ కార్యదర్శి సుదర్శన్ డిమాండ్ చేశారు. మంగళవారం మాట్లాడుతూ చంద్రబాబు తాము అధికారం చేపడితే గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల చొప్పున స్థలం ఇచ్చి, ఇంటి నిర్మాణానికి రూ.4లక్షలు ఇస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారం చేపట్టి 8 నెలలు దాటినా ఇంతవరకు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. విజయ్, లక్ష్మీనారాయణ, నాగరాజు పాల్గొన్నారు.

ఏబీవీపీ కార్యవర్గ సభ్యుడిగా పవన్ కళ్యాణ్

పత్తికొండ టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఆవుల పవన్ కళ్యాణ్ ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర మహాసభలో తనను ఎన్నుకుననట్లు ఏబీవీపీ బలోపేతానికి, విద్యార్థుల సమస్యల సాధనకై పోరాడతామన్నారు.

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

పత్తికొండ టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుచ్చకాయలమడ ఆర్బీకే వద్ద టీడీపీ నాయకుడు సాంబశివారెడ్డి కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేయడం హర్షణీయమన్నారు. ఏవో వెంకట్రాముడు, ఏడీఏ విజయ్‌మోహన్ కుమార్ మాట్లాడుతూ 2024-25 ఈకేవైసీ చేసుకున్న రైతులు ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల న్నారు. క్వింటం రూ.7,550ల ధరతో డీసీఎంఎస్ ద్వారా కొనుగోలు చేస్తామని రైతులు వినియోగించుకోవాలని కోరారు. సర్పంచ్ హరితమ్మ, ఏవో శ్రీనాథ్, సత్యనారాయణ, డీసీఎంఎస్ సిబ్బంది మల్లికార్జున, రామకృష్ణ, బాబ్జి రెడ్డి పాల్గొన్నారు.

దేవనకొండ: నల్లచెలిమల(నర్మామల) రైతు సేవాకేంద్రంలో కందులను కొనుగోళ్లను ఏవో సురేష్ బాబు, సర్పంచ్ నాగమ్మ ప్రారంభించారు. డీసీఎంఎస్ మేనేజర్ రామకృష్ణ, బాలకృష్ణ, నర్సోజీ, నరసింహుడు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతో అభివృద్ధి

తుగ్గలి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంతో పంచాయతీలు అభివృద్ధి చెందుతున్నాయని పంచాయతీ సలహాదారుడు లక్ష్మణస్వామి యాదవ్, బీసీ నాయకుడు సంగాల క్రిష్ణ అన్నారు. మంగళవారం జొన్నగిరిలో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీ నిధులను పక్కదారి పట్టించడంతో పారిశుధ్య పనులు కూడా చేయలేదన్నారు. ఆరు నెలల్లోనే కూటమి గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలువలు కూడా కూడా నిర్మించిందన్నారు. జయరాం, హోటల్ మల్లి, నాగరాజు, తదితరులు ఉన్నారు.

పద్మశ్రీ అవార్డు పట్ల హర్షం

ఆస్పరి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు పట్ల మండల నాయకులు సన్ జప్పా రామాంజినేయులు సంజన హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక మార్కెట్ నుంచి బస్టాండ్ మీదుగా అంబేద్కర్ సర్కిల్ వరకు డప్పులతో ర్యాలీ నిర్వహించారు.

పంట నష్ట పరిహారం ఇవ్వాలి

మద్దికెర, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పంట నష్టపోయిన శనగ రైతులకు ఎకరాకు రూ.25వేల నష్ట పరిహారం ఇవ్వాలని వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రేలంపాడు వెంకటేశ్వర్లు, డిమాండ్ చేశారు. మంగళవారం మద్దికెరలో మాట్లాడుతూ మండలంలో 20వేల ఎకరాల్లో శనగ సాగుచేయగా, దిగుబడి ఎకరాకు 2 క్వింటాళ్లు కూడా రాలేదన్నారు. మాజీ ఉప సర్పంచ్ వెంకట్రామిరెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, కృష్ణ యాదవ్ పాల్గొన్నారు.

విధుల్లో పోటీతత్వం ఉండాలి

ఆదోని రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు విధుల్లో పోటీ తత్వం ఉండాలని ఎంపీడీవో రాజేంద్ర ప్రసాద్, మాజీ ఎంపీపీ బడాయి పొంపాపతి, మాజీ జడ్పీటీసీ ఆనంద్ తెలిపారు. గణతంత్ర దినోత్సవంనాడు కలెక్టర్ చేతులమీదుగా ప్రశంసా పత్రాలు అందుకునన సీనియర్ అసిస్టెంట్ వీరభద్రయ్య, కార్యదర్శి చంద్రశేఖర్‌ను సన్మానించారు.

కొనుగోళ్లలో నిబంధనలు పాటించాలి


రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని అగ్రికల్చర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోళ్లలో సీసీఐ నిబంధనలను పాటించాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సూచించారు. మంగళవారం ఆయన ఎన్‌డీబీఎల్, దారా పత్తి దిగుబడుల్లో తేమ శాతాన్ని పరిశీలించారు. కొనుగోళ్ల వివరాలను సీసీఐ ఇన్‌చార్జులు భరత్ కుమార్, గౌతమ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఏడీఎం సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఐదు పరిశ్రమల్లో 7240 మంది రైతులు నుంచి 1,70,655 క్వింటాళ్ల పత్తిని సీసీఐ కొనుగోలు చేసిందన్నారు. 15 రోజుల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నారని తెలిపారు. మార్కెట్ యార్డ్ కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి, డీటీ గుండాల నాయక్, ఎండీబీఎల్ పరిశ్రమ అధినేత బత్తిని కుబేర్నాథ్, దారాశ్రీ పరిశ్రమ అధినేత వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేయాలి


ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎంపీడీవో వరలక్ష్మి

హాలహర్వి , జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు అంకిత భావంతో పనిచేయాలని ఎంపీడీవో వరలక్ష్మి సూచిం చారు. మంగళవారం బాపురం సచివాల యాన్ని తనిఖీ చేశారు. గ్రామాల్లో ఆరేళ్లలోపు పిల్లల ఆదార్ నమోదు, ఉపాధి పనులను అనంతరం వ్యక్తిగత మరుగుదొడ్లను పరిశీలించారు. కార్యదర్శి సజీజ్ అహ్మద్, బాషా, శిల్పా, కృప ఉన్నారు.

తపాలా సేవలను విస్తరిస్తాం : ఏడీ

- పోస్టల్ ఏడీ నాగనాయక్



ఆలూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : తపాలా సేవలను మరింతగా విస్తరిస్తామని పోస్టల్ కర్నూలు రీజిజియన్ అసిస్టెంట్ డైరెక్టర్ నాగనాయక్ తెలిపారు. మంగళవారం ఆలూరు పోస్టాఫీసును ఆయన సందర్శించారు. పోస్టల్ పథకాలను గ్రామాల్లో ప్రచారం చేస్తామన్నారు. పొదుపు ఖాతాలు, ఐపీపీబీ ఖాతాలు, పీఎల్ఐ, పీఆర్ఎల్ఐ భీమా పాలసీల గురించి ప్రజలకు వివరించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట స్థానిక పోస్ట్ మాస్టర్ నాగరాజు, పోస్టల్ అసిస్టెంట్స్ హరికృష్ణ, సుధాకర్ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



పంట డిగుబడి గురించి రైతులకు వివరిస్తున్న ఏవో

దేవనకొండ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో సురేష్‌బాబు సూచించారు. మంగళవారం మండలంలోని పుల్లాపురంలో పొలం పిలుస్తుంది నిర్వహించారు. వేరుశనగలో అధిక దిగుబడుల సాధనకు రైతులకు సూచలు తెలియజేశారు. ఊడలు బాగా రావాలంటే విత్తిన 30 రోజులకు ఎకరానికి నాలుగు బస్తాల జిప్సం పిచికారీ చేయాలన్నారు ఏఈవో రంగన్న వీఏఏ సలీం, రైతులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూస్తాం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- పంచాయతీ ఈవో లక్ష్మీనాథ్



వెల్దుర్తి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వేసవిలో మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూస్తామని పంచాయతీ ఈవో లక్ష్మీనాథ్ అన్నారు.

ప్రశ్న: తాగునీరు అందుబాటులో ఉందా?

జవాబు: నీరు పుష్కలంగా ఉంది. బ్రహ్మగుండం, తొగర్చేడు, క్రిష్ణగిరి హెచ్ఎన్ఎస్ పథకాల ద్వారా నీటిని అందిస్తున్నాం.

ప్రశ్న: పారిశుధ్యం, వీధిలైట్ల నిర్వహణ ఎలా ఉంది?

జవాబు: రెండు రోజులకోసారి పారిశుధ్య పనులు చేయిస్తున్నాం. వీధిలైట్లు సక్రమంగా వెలిగేలా చర్యలు తీసుకున్నాం.

ప్రశ్న: సిబ్బందికి జీతాభత్యాలు పెండింగ్ ఉన్నాయా?

జవాబు: గతంలో పెండింగ్ ఉన్న బకాయిలు చెల్లించాం. సిబ్బంది జీతాలు వారి బ్యాంక్ అకౌంట్లలో జమచేస్తున్నాం.

ప్రశ్న: జనన, మరణ ధ్రువపత్రాలు ఎలా పొందాలి?

జవాబు: పుట్టిన లేదా చనిపోయిన 21 రోజుల్లోపు దరఖాస్తు చేసుకుంటే విచారణ చేసి సర్టిఫికెట్లు అందజేస్తున్నాం. 21 రోజులు దాటితే తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి.

ప్రశ్న: పన్నులు ఎలా వసూలు చేస్తున్నారు?

జవాబు: బిల్ కలెక్టర్ లేకున్నా, ఇతర సిబ్బంది ద్వారా పన్నులు వసూలు చేస్తున్నాం. ప్రజలు ఇంటి, కొళాయి పన్ను, లైసెన్సు ఫీజులు సకాలంలో చెల్లించి అభివృద్ధికి సహకరించాలి.


ప్రశ్న: గృహ నిర్మాణ అనుమతులు ఎలా?

జవాబు: వెల్దుర్తి మండలం కుడా(కర్నూలు అర్బన్ డెవలెప్‌మెంట్ అథారిటీ) పరిధిలో ఉంది. జీవో.నెం.12 ప్రకారం 100 చ.గ.లకు పైగా నిర్మిస్తున్న వారు ఎల్.టీ.పీ(లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్) ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే అనుమతులు మంజూరు చేస్తున్నాం.

మారేదెప్పుడు?

- ఏళ్లు గడుస్తున్నా మారని ప్రభుత్వ కార్యాలయాలు
- చిన్నచిన్న పనుల కోసం రెండు మూడు మండలాలు తిరగాల్సిన పరిస్థితి

గోనెగండ్ల, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పరిపాలన సౌలభ్యంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు గాను ప్రభుత్వం నియోజకవర్గాల పునర్విభజన చేసింది. పునర్ విభజన జరిగి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు ప్రభుత్వ శాఖలు సబ్‌డివిజన్‌లు కొన్ని మారలేదు. దీంతో మండల ప్రజలు వివిధ ప్రభుత్వ శాఖ అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. 1984లో మండల వ్యవస్థ ఏర్పడింది. అప్పటి నుంచి గోనెగండ్ల మండలం పత్తికొండ నియోజక వర్గంలో ఉండేది. 2009 ఎన్నికలు ముందు జరిగిన నియోజక పునర్ విభజనలో గోనెగండ్ల మండలాన్ని ఎమ్మిగనూరు నియోజకవర్గంలోకి మార్చారు. మండలానికి చెందిన పలు ప్రభుత్వ శాఖలు సబ్ డివిజన్ కార్యాలయాలు ఇప్పటికి పత్తికొండలోనే కొనసాగుతుండటంతో పాలనా పరంగా నాడు ఎదుర్కొంటున్న ఇబ్బందులు నేటికి కూడా తప్పడం లేదు. అలాగే కోడుమూరు కేంద్రంగా కొన్ని శాఖలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం గోనెగండ్ల మండలం ఆదోని డివిజన్‌లో ఉండగా సబ్ రిజిస్టర్ కార్యాలయం, రోడ్డు భవనాల శాఖ, ఉద్యానవన శాఖ, టెలికం శాఖ, కేంద్ర సహకార బ్యాంక్ మొదలైనవి కోడుమూరులోనే ఉన్నాయి. ఎక్సైజ్ పోలీస్ స్టేషన్, ఐసీడీఎస్, సీడీపీవో సెక్టార్‌తో పాటు ఫారెస్టు సబ్‌డివిజన్, మేజిస్టేట్ కోర్టు 70 కిలోమీటర్లు దూరంలో ఉన్న పత్తికొండలో ఉన్నాయి. వ్యవప్రయాసలతో వెళ్లి రావాల్సిన పరిస్థితి. దీంతో మండల ప్రజలు అధికారులు ఇబ్బందులు పడుతున్నట్లు వాపోతున్నారు. దీని వల్ల సమయం వృథా అవుతుందని అధికారులు తెలుపుతున్నారు. ప్రభుత్వం వెంటనే మండలానికి సంబంధించిన ప్రభుత్వ శాఖల సబ్‌డివిజన్‌లను కోడుమూడు, పత్తికొండ శాఖల నుంచి ఎమ్మిగనూరుకు మార్చాలని కోరుతున్నారు. కోర్టు పని నిమిత్తం పత్తికొండకు వెళ్లిరావాలంటే అదో శిక్షగా ఉంటుందని ప్రజలు, అధికారుల వాపోతున్నారు. నియోజక వర్గ పునర్విభజన తరువాత హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇటీవల పోలీస్ శాఖను కర్నూలు డివిజన్ నుంచి ఎమ్మిగనూరుకు బదిలి అయ్యాయి. మిగిలిన శాఖలు కూడా ఎమ్మిగనూరుకు మార్చాలని ప్రజలు కోరుతున్నారు.


గోనెగండ్ల ఏరియల్ వ్యూ

ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలి


నియోజకవర్గ పునర్విభజన చేసినప్పటికి ప్రభుత్వం సబ్ డివిజన్‌లను మార్చక పోవడంతో ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యల పరిష్కరించేందుకు దృష్టి సారించాలి.

- నాయక్ షాషావలి, గోనెగండ్ల

పత్తికొండకు వెళ్లిరావాలంటే చాలా ఇబ్బంది


కోర్టు పనిపై పత్తికొండకు వెళ్లి రావాలంటే చాలా ఇబ్బందిగా ఉంటుంది. ఒక రోజు అంతా ఇదే పనికి కేటాయించాలి. అధికారులకు కూడా ఇబ్బంది గానే ఉంది. ప్రభుత్వం సకాలంలో స్పందించాలి.

- శ్రీనివాసులనాయుడు, గాజులదిన్నె

టీడీపీలో చేరిక


మాధవరం వైసీపీ కార్యకర్తలకు పార్టీ కండువా వేస్తున్న టీడీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, అమర్నాథ్ రెడ్డి

మంత్రాలయం జనవరి 28(ఆంధ్రజ్యోతి): టీడీపీలో పలువురు వైసీపీకి చెందిన వారు చేరారు. మంగళవారం మంత్రాలయంలో టీడీపీ కార్యాలయంలో మండల కన్వీనర్ పన్నగ వెంకటేశ్ స్వామి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు పైబావి అమర్నాథ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో మాధవరం చెందిన వైసీపీకి చెందిన 30 కుటుంబాలు వారు టీడీపీలో చేరారు. వీరికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస రెడ్డి, అమర్నాథ్‌రెడ్డి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో తెలుగురైతు జిల్లా కార్యదర్శి ఎల్లారెడ్డి, విజయరామిరెడ్డి, నరసింహులు, తెలుగు యువత మండల అధ్యక్షులు సాయికుమార్ రెడ్డి, ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షులు సోల్మాన్ రాజు, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి యేబు, నవకోటి నారాయణ, సుంకప్ప, లక్ష్మన్న, నర్సిరెడ్డి, పైబావి నర్సిరెడ్డి, భీమేష్, నరసింహులు, మొండి హనుమంతు, పవన్ కుమార్, మాధవరానికి చెందిన వాల్మీకి సోదరులు ముక్కిరాళ్ల కర్రెన్న కుమారులు భీమన్న, అంజినేయ, హనుమంతు, రాముడు, దుల్లయ్య, వీరేష్, రాముడు, వార్డు మెంబర్ రాజశేఖర్, అలీబాషా, హరి, రామలింగయ్య ఉన్నారు.

నేడు దస్తగిరి స్వామి ముఖద్వారం ప్రారంభం

మంత్రాలయం జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని వగరూరు గ్రామంలో దస్తగిరి స్వాముల ఆలయ ముఖద్వారం బుధవారం ప్రారంభిస్తున్నారు. దాదాపు రెండేళ్ల పాటు గ్రామ పెద్దలు, దాత సహకారంతో సుందరంగా ముఖద్వారాన్ని నిర్మించారు. ముఖ్యఅతిథులుగా ఏపీ రాష్ట్ర మైనార్టీ వ్యవహారాల సలహాదారులు మహ్మద్ షరీఫ్, రిటైర్డు ఐజీ మహ్మద్ ఇక్బాల్, ఏపీ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్, ఏపీ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్‌లతో పాటు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి హాజరవుతున్నారని నిర్వాహకులు సయ్యద్ షాబీర్ బాషాఖాద్రి, సయ్యద్ షాకీర్ ఖాద్రి, సయ్యద్ తల్హా ఖాద్రి, ఖాన్‌అబ్దుల్ తెలిపారు. కార్యక్రమంలో నజీర్ అహ్మద్, షాహీద్‌పీరా ఖాద్రి, శేషిరెడ్డి, పవన్ కుమార్, వీరారెడ్డి, గోపాల్, మాబు హుశేన్, షమీర్, షకీల్, రఫీక్ ఏర్పాట్లు చేస్తున్నారు.

నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోండి

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే నైపుణ్య శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం కో-ఆర్డినేటర్ రాఘవేంద్ర చౌదరి కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ పరిశోధన సంస్థ, జైపూర్, సింజెంటా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నెలరోజుల పాటు గ్రామీణ యువతి, యువకులకు వ్యవసాయ అనుబంధ రంగాలలో ఉచిత నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ క్రమంలో నెలకు రూ.ఐదువేల స్టైఫండ్ తో పాటు ఉచిత వసతి, భోజన సౌకర్యం ఉంటుందన్నారు. శిక్షణలో ప్రతిభ కనబరిచిన వారికి సింజెంట్ కంపెనీలో ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. శిక్షణ పొందాలనుకునే వారు 10వ తరగతి పాసై ఉండాలన్నారు. అలాగే వ్యవసాయ డిప్లమో ద్వితీయ సంవత్సరం చదువుతూ ఉండాలని, వ్యవసాయ డిప్లమో పూర్తిచేసిన వారు అర్హులన్నారు.

వలసలు నివారించాలి

కోసిగి జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలో వలసలను నివారించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వీరేష్, ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు చిన్న అన్నారు. మంగళవారం కోసిగిలోని ఎమ్మెల్యే వై. బాలానాగిరెడ్డికి వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోసిగి మండలంలో అన్ని గ్రామాల నుంచి రోజు రోజుకు వలసలు పెరుగుతున్నాయని, చదువుకునే పిల్లలను కూడా వెంట తీసుకెళ్తున్నారని, కూలీలకు పనులు కల్పించి వలసలు నివారించాలన్నారు. మండలంలో సీజనల్ హాస్టల్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధి హామీ పథకంలో పని దినాలు పెంచి కూలీలకు రూ.500లు చెల్లించాలన్నారు. కోసిగిలో వివిధకాలనీల్లో డ్రైనేజీలు, సీసీ రోడ్లు, తాగు నీరు సక్రమంగా లేవని, వాటిని పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నరసప్ప పాల్గొన్నారు.

తాగునీటి సౌకర్యం ఏర్పాటు

ఎమ్మిగనూరు టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల నమోదు కార్యక్రమంలో చంటి బిడ్డలతో ఎండలోనే అంటూ ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. బాలింతలు, సహాయకులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. కనీస సౌకర్యాలు లేవంటూ సమస్యలను ప్రస్తావించింది. దాంతో వైద్యా ధికారులు స్పందించారు. బాలింతలకు తాగు నీ టి సౌకర్యం కల్పించారు. బాత్‌రూములను శుభ్రం చేయించారు. కూర్చునేందుకు కుర్చీలు ఏర్పాటు చేస్తామని ఆస్పత్రి సూపరింటెం డెంట్ డాక్టర్ సుధా అయ్యంగార్ తెలిపారు.

వందశాతం వసూలు చేయాలి

గోనెగండ్ల, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఈఏడాది మార్చి చివరి నాటికి గోనెగండ్లలో ఇంటిపన్నులు, తాగునీటి పన్ను, దుకాణాల పన్నులు వందశాతం వసూళ్లు చేయాలని గ్రామ మేజర్ సర్పంచ్ హైమావతి, కార్యదర్శి సతీష్ కోరారు. మంగళవారం పంచాయతీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో ఉన్న గృహాల వారు తప్పని సరిగా స్వర్ణపంచాయతీ కార్యక్రమంలో తమ గృహాలను ఆన్‌లైన్ చేయించుకోవాలన్నారు. చేయించుకున్నవారు తప్పుఒప్పులను సరిచూసుకోవాలన్నారు. గ్రామాలలో గృహాలను ఆన్‌లైన్ చేసుకునే కార్యక్రమం ముగిసిందన్నారు. మండల కేంద్రమైన గోనెగండ్లలో 4760 గృహాలు ఉన్నాయని మండల వ్యాప్తంగా 13621 గృహాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్ మలాంగ్, సుబాన్, అనిల్ పాల్గొన్నారు.

'అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలి'

ఎమ్మిగనూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): తమ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, దాన్ని రద్దుచేసి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పట్టణానికి చెందిన కే అబ్దుల్ మునాఫ్ కోరారు. మంగళవారం తహసీల్దారు శేషఫణికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలుగొట్ల గ్రామ పరిధిలో సర్వేనంబర్ 146సీ1లో 2.14ఎకరాలు, మా తమ్ముడుకు 1.13 ఎకరాలు భూమి ఉందన్నారు. ఈ భూమిని ఎమ్మిగనూరుకు కొంత మంది భూకబ్జాదారులు రసూల్, ఇబ్రహీం, రంగన్న, యోగి, చందుల తోపాటు మరికొంతమంది ఫోర్జరీ సంతకాలతో దొంగ రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. ప్రస్తుతం భూమి దగ్గరకు వస్తే చంపుతామని బెదిరిస్తున్నా రన్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా ఇది సివిల్ కేసు అని కోర్టును ఆశ్రయించండంటూ తిప్పి పంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విచారించి వారిపై కేసులు నమోదు చేయాలని కోరారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న అబ్దుల్ మునాఫ్

రాజకీయాలకతీతంగా పనులు చేయండి: ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

కోసిగి జనవరి 28(ఆంధ్రజ్యోతి): రాజకీయాలకతీతంగా అధికారులు పనులు చేయాలని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అన్నారు. మంగళవారం కోసిగిలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఈరన్న, ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సర్వసభ్య సమా వేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాల నాగిరెడ్డి హాజరయ్యారు. ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం ఎమ్మెల్యే వచ్చిన 12 గంటల తర్వాత ప్రారంభమైంది. రెండు గంటల పాటు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ఎదురు చూశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా అధికారులు పనులు చేయాలని, కూటమి అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలల్లో ఎక్కడా అభివృద్ధి లేదని, వారి నాయకుల గొడివలకే సమయంతా సరిపోయిం దని ఎద్దేవా చేశారు. అనంతరం పంచాయతీరాజ్ ఏఈ మాలిక్ , హౌసింగ్ ఇన్‌చార్జి ఏఈ మంజునాథ్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మనోజ్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో మాధవశంకర్, తహసీల్దార్ రుద్రగౌడు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యురాలు పవి త్రపాటిల్, కోఆప్షన్ మెంబర్ షౌకత్ ఆలీ, అన్ని శాఖల అధికా రులు, సర్పంచులు, ఎంపీటీసీలు ఉన్నారు. ఎస్ఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

గోకులం షెడ్ల నిర్మాణం చేపట్టాలి


ఎంపీడీవోకు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

మంత్రాలయం జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద చేపడుతున్న గోకులాల షెడ్లు, రోడ్లు, నీటి ట్యాంకులు, పండ్ల మొక్కలు, మరుగుదొడ్లు, నీటి కుంటల నిర్మాణాల పనులు చేపట్టాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్‌యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ప్రభావతిదేవికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రాలయంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద చేపడుతున్న పనులు కొంత మందికి మాత్రమే ఉపయోగపడుతున్నాయని, అందరికీ అవసరమైన మరుగుదొడ్లు, గోకులాల షెడ్లు, మట్టి రోడ్లు నిర్మాణం చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గాబ్రియేలు, హనుమంతు, దయాకర్, లక్ష్మణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రెండు రాష్ట్రాల సరిహద్దుల పరిశీలన


హద్దులను పరిశీలిస్తున్న కర్ణాటక- ఆంధ్రారాష్ట్రాల అధికారులు

నందవరం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రెండు రాష్ట్రాల రీ సర్వే సరిహద్దులను మంగళవారం కర్ణాటక- ఆంధ్రారాష్ట్రాల అధికారులు పరిశీలించారు. మండలంలోని నదికైరవాడి దగ్గర నది సరిహద్దు ప్రాంతంలో కర్ణాటకలోని గంగవర్, మల్క్యాపుర్, తలమారి గ్రామాల మధ్య రీ సర్వే సరిహద్దులను అధికారులు పరిశీలించి తుంగభద్ర నదిలో కొలతలు వేశారు. రాయచూరు నియోజకవర్గ సర్వే సూపర్‌వైజర్ నిజాముద్దీన్, సర్వేయర్లు వినోద్‌కుమార్, సద్దాం పాల్గొనగా , ఆంధ్రా నుంచి నందవరం తహసీల్దారు శ్రీనివాసులు, రీసర్వే డీటీ మహేష్, ఆర్ఐ సుబ్బారెడ్డి, డిపార్ట్‌మెంటల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరాజు, మండల సర్వేయర్ అక్బర్‌బాష, ముగతి శేఖర్ పాల్గొన్నారు. రెండు ప్రాంతాల నివేదికలను సంబంధింత అధికారులకు అందజేస్తామని తెలిపారు.

డిగ్రీ నుంచే సివిల్స్‌పై దృష్టి పెట్టాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకుడు హర్షవర్ధన్

పెద్దకడుబూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): డిగ్రీనుంచి విద్యార్థులు సివిల్స్ పరీక్షలపై దృష్టి పెట్టాలని హైదరాబాద్‌కు చెందిన ఐఏఎస్ శిక్షణ అధ్యాపకులు హర్షవర్ధన్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని ఎస్‌ఎంఎల్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సివిల్స్ పరీక్షలపై కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్ మాట్లాడుతూ సివిల్‌సర్వీసెస్‌లో 27రకాలు ఉన్నాయని, ప్రజలకు సేవ చేయటానికి ఉత్తమ మార్గాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా సివిల్ సర్వీసెస్ కోచింగ్ ఇచ్చే ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుశీలమ్మ, న్యాక్ కో-ఆర్డినేటర్ పాల్ దేవదానం, అధ్యాపకులు, కెరీర్ గైడెన్సెల్ ఇన్‌చార్జీలు రాజశేఖర్, ఖాదర్‌బాషా, లక్ష్మన్న, తిప్పే స్వామి, సూపరిండెంటెంట్ మద్దిలేటి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు సహకరించాలి

మండల సమావేశంలో ఎంపీపీ లక్ష్మీదేవమ్మ

నందవరం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలో అభివృద్ధి పనులకు అధికారులంతా సహకరించాలని ఎంపీపీ ముగతి లక్ష్మీదేవమ్మ కోరారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన ఎంపీడీవో పుల్లయ్య ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరిస్తేనే గ్రామాలు అభివృద్ధి బాటలో నడుస్తాయన్నారు. పీఆర్ ఏఈ నరసింహులు మాట్లాడుతూ మండలానికి రూ. మూడు కోట్లు మంజురైనట్లు తెలిపారు. రూ. రెండు కోట్లుపైనే ఖర్చు చేశామన్నారు. కొన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీపనులు పూర్తయ్యాయని, రూ కోటితో మిగితా గ్రామాల్లో కూడా పనులు మొదలు పెట్టామన్నారు. ట్రాన్స్‌కో ఏఈ నాగేంద్ర మాట్లాడుతూ సోలర్ సిస్టం వచ్చిందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. నందవరం ఎస్సీ కాలనీలో స్థలం ఇప్పిస్తే ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సులోచన, ఎంఈవో సుదర్శన్‌రెడ్డి ప్రగతి నివేదిక చదివి వినిపించారు. జగ్గాపురం ఎంపీటీసీ సభ్యురాలు అనుమంతమ్మ మాట్లాడుతూ తమ గ్రామంలో తాగునీటి కోసం చాలా ఇబ్బందులు పడుతున్నామని సభ దృష్టికి తెచ్చారు. ముగతి గ్రామంలో ఇల్లు కట్టుకోవాలంటే పొజిషన్ సర్టిఫికెట్ కావాలంటున్నారని సర్పంచ్ విరుపాక్షిరెడ్డి సభ దృష్టికి తీసుకవచ్చారు. ప్రజాప్రతినిధులు సమావేశం దృష్టికి తీసుకవచ్చిన సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని ఎంపీడివో పుల్లయ్య సూచించారు. సమావేశంలో డీటీ శశిశేఖర్‌రావు, ఎంపీఎం రాఘవేంద్ర, ఏపీవో శ్రీని వాసులు, సీహెచ్‌వో బలరామయ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ

మంత్రాలయం ప్రధాన రహదారి కబ్జా

- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ, శ్రీమఠం అధికారులు


ఆర్‌అండ్‌బీ స్థలంలో ఏర్పాటు చేసిన దుకాణాలు

మంత్రాలయం జనవరి 28(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చే భక్తుల కోసం ప్రధాన రహదారులు సిమెంటు రోడ్లు, అండర్ డ్రైనేజీ నిర్మాణం చేశారు. అయితే కొంత మంది ప్రధాన రోడ్డులో ఆర్‌అండ్‌బీ స్థలాన్ని తమ దుకాణాలు, లాడ్జీల ముందే తోపుడు బండ్లు పెట్టుకునే వారికి నెలకు రూ.30వేల నుంచి రూ.40వేల వరకు బాడుగకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. టీకొట్టు, పానీ పూరి, టిఫిన్, ఫాస్ట్‌ఫుడ్, టెంకాయల వ్యాపారం పెట్టి నెలకు రూ. లక్షల్లో వసూళ్లకు పాల్పడుతున్నా అడిగే వారే లేరు. లాడ్జీలు, హోటళ్లు, పార్కింగ్ స్థలాలు లేక ప్రధాన రోడ్డుపైనే వాహనాలు ఆపడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. శ్రీమఠం అధికారులు దృష్టి సారించి కబ్జాకు గురైన రోడ్డు స్థలాన్ని క్రమబద్ధీకరించి భక్తుల రాకపోకలకు, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని కోరుతున్నారు.

రమణీయం.. ప్రహ్లాదరాయల వెండి రథోత్సవం


వెండి రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు వెండిరథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. మంగళవారం పుష్యమాసం ముగింపు చతుర్థశి పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో అర్చకులు బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూర్ణబోధపూజ మందిరంలో ఉత్సవమూర్తికి పాదపూజ చేసి పల్లకిలో ఊరేగించారు. అనంతరం వెండి రథంపై ప్రహ్లాదరాయలను అధిష్టించి ఊరేగించారు. అనంతరం ఊంజలసేవ నిర్వహించారు. పీఠాధిపతి భక్తులకు శేష వస్త్రం, ఫల,పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వాదించారు.

ఆర్‌ఓఆర్ కేసులపై విచారణ

ఎమ్మిగనూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): భూములకు సంబంధించి నమోదైన ఆర్‌ఓఆర్ కేసులపై మంగళవారం తహసీల్దారు శేషఫణి విచారణ చేపట్టారు. మండల పరిధిలోని కలుగొట్ల గ్రామ పరిధిలో ఉన్న ఓ రైతు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల మధ్య నమోదైన ఆర్‌ఓఆర్ కేసుపై ఇరువర్గాల వాదనలు విన్నారు. అలాగే స్థానికంగా ఏర్పాటు చేసిన బోర్డుపై భూమికి సంబంధించి సర్వేనంబర్లును సూచిస్తూ చిత్రపటం వేసి ఇరువురికి భూముల వివరాలను సర్వేయర్ విజయ్ ప్రకాష్ వివరించారు. అయితే ఇరువురు సమ్మతించకపోవటంతో విచారణను మరో రోజుకు వాయిదా వేశారు. కార్యక్రమంలో డీటీ వీరేంద్ర గౌడ్, వీఆర్‌ఓ సుబ్బలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలపై అవగాహన

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత నియమాలపై ఎమ్మిగనూరు పోలీసు సిబ్బంది మంగళవారం భాష్యం పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో హెడ్‌కానిస్టేబుల్ హనుమంతు, కానిస్టేబుల్ రఘు రోడ్డు ప్రమాదాలు, ఇన్సూరెన్స్ విషయాలను క్లుప్తంగా వివరించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లేగదూడకు పౌష్టికాహారం ఇవ్వాలి

నందవరం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): లేగ దూడలకు బలమైన పౌష్టికాహారం ఇవ్వాలని కర్నూలు జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ శ్రీనివాసులు సూచించారు. మంగళవారం మండలంలోని పెద్దకొత్తిలి గ్రామంలో కర్నూలు పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో లేగదూడల ప్రదర్శన కార్యకమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేలు జాతి దూడలను పెంచాలన్నారు. కార్యక్రమంలో అధికారులు డాక్టర్ భూపాల్‌రెడ్డి, డాక్టర్ రాజశేఖర్, మల్లన్న, సుబ్రమణ్యేశ్వరస్వామి, వెంకటసుబ్బయ్య, రవిబాబు, బన్ని హేమంత్‌కుమార్, నరేంద్రనాథ్‌రెడ్డి, ఉషారాణి, శ్రీదేవి, సంధ్య పాల్గొన్నారు.

ఆయకట్టుకు జీడీపీ నీరు మళ్లింపు


కోడుమూరుకు తరలుతున్న జీడీపీ నీరు

గోనెగండ్ల, జనవరి 28(ఆంధ్రజ్యోతి): తుంగభద్రదిగువ కాలువ కింద కోడుమూరు సెక్షన్ పరిధిలో పంటలు సాగు చేసుకుంటున్న ఆయకట్టు రైతులకు నీరు సక్రమంగా విడుదల కాకపోవడంతో ఇరిగేషన్ అధికారులు నాలుగురోజులుగా గాజులదిన్నె ప్రాజెక్టు నీటిని ఎల్లెల్సీ కోడుమూరు సెక్షన్ మళ్లిస్తున్నారు. దీంతో కోడుమూరు రైతులు ఊపిరి పీల్చుకున్నారు. లేకపోతే ఎల్లెల్సీ కాలువకు నీరు సక్రమంగా విడుదల కాకపోవడంతో కోడుమూరు సెక్షన్ పరిధిలోని పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో ఇరిగేషన్ అధికారు ఎలెల్సీనీరు, జీడీపీ నీటిని కలిపి రోజుకు 99 క్యూసెక్కుల నీటిని కోడుమూరుకు మళ్లిస్తున్నారు. గోనెగండ్ల సెక్షన్ కు ఎగువప్రాంతం నుంచి ఎల్లెల్సీనీరు 81 క్యూసెక్కులు వస్తున్నాయి. అయితే 35 క్యూసెక్కులు కోడుమూరుకు విడుదల చేసి మిగతా 46 క్యూసెక్కుల నీటిని గోనెగండ్ల రైతులు తమ పొలాలకు వాడుకుంటున్నారు. దీంతో కోడుమూరుకు తక్కువ కావడంతో ఇరిగేషన్ అధికారులు జీడీపీ అధికారులతో మాట్లాడి రోజుకు 64 క్యూసెక్కుల నీటిని కోడుమూరుకు మళ్లించే విధంగా చర్యలు తీసుకున్నారు. ఎల్లెల్సీనుంచి 35 క్యూసెక్కులు, జీడీపీ నుంచి 64 క్యూసెక్కులు కలిపి 99క్యూసెక్కుల నీరు కోడుమూరు ఆయకట్టు రైతులకు చేరుతోంది. ఎన్ని రోజులు నీటి విడుదల ఉంటుందో అధికారులు చెప్పలేక పోతున్నారు.

దరఖాస్తులు స్వీకరించాలి: సీపీఎం


కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పింఛన్లు, రేషన్ కార్డులు, సంక్షేమ పథకాలకు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో స్వీకరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై మునిసిపల్ కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం పట్టణ కార్యదర్శి రాముడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్న సచివాలయాల్లో వెబ్‌సైట్‌ని రద్దు చేసి ప్రజలకు అవసరమైనటువంటి సంక్షేమ పథకాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. అలాగే లక్ష్మీపేట, సంజీవనగర్, ఎస్సీ కాలనీ, పట్టణ శివారు ప్రాంతాలలో రోడ్లు, కాలువలు, కొత్త పైపులు వేసి తాగునీటి సమస్యలను పరిష్కరించా లన్నారు. కార్యక్రమంలో అబ్దుల్లా, రమేష్, సురేష్, తిమ్మప్ప పాల్గొన్నారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో గుంతకల్లు డీఆర్‌ఎం

మంత్రాలయం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామిని గుంతకల్లు రైల్వే డివిజన్ రీజనల్ మేనేజర్ చంద్ర శేఖర్ గుప్తా మంగళవారం సాయంత్రం దర్శించుకున్నారు. శ్రీమఠం మహాముఖ ద్వారం వద్ద మఠం అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. ఆయన వెంట ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్‌జోషి, సురేష్ కోనాపూర్, ఐపీ నరసింహమూర్తి, స్టేషన్ మాస్టర్ వాస్నిక్, అనంతస్వామి, ప్రకాష్ ఆచార్, జయతీర్థ ఆచార్, నరసింహ దేశాయ్ పాల్గొన్నారు.

పంచాయతీ ఆదాయం పెంచాలి

గోనెగండ్ల, జనవరి 28(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలో వర్మీకం పోస్టును తయారు చేసి పంచాయతీకి ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నట్లు గంజహళ్లి పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం గంజహళ్లి గ్రామంలోని చెత్త సంపద కేంద్రంలో వర్మీ కంపోస్టు తయారు చేసేందుకు గాను చెత్త తొట్లలో వానపాములను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త సంపద కేంద్రంలో వర్మీ కంపోస్టును తయారు చేసి అమ్మి పంచాయతీకి ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నమన్నారు. గ్రామంలో తాగునీటి సమస్య, వీధిదీపాల సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.